మిస్ విశాఖ సృజనాదేవి



» అందాల కిరీటంతో మెరిసిన యువ వైద్యురాలు

మహారాణిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన డాక్టర్ సృజనాదేవి మిస్ విశాఖ-2025 కిరీటం దక్కించుకున్నారు. ఫరెవర్ మిస్ ఇండియా జాతీయ స్థాయిలో నిర్వహించే అందాల పోటీల్లో మహిళలకు ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం ఆధారంగా పురస్కారం ప్రకటిస్తారు. ఈ క్రమంలో డాక్టర్ సృజనాదేవిని మిస్ విశాఖ-2025గా ప్రకటించారు. హోటల్ నోవాటెల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అందాల కిరీటం అలంకరించారు. త్వరలో రాజస్థాన్‌లో ని జైపూర్‌లో జరిగే జాతీయ గ్రాండ్ ఫినాలే లో ఆమె రాష్ట్రం తరపున పాల్గొంటారు. డాక్టర్ సృజన కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, తమిళనాడులో ఎండీ అనస్థీషియా చేసి స్థానికంగా వైద్య సేవలందిస్తున్నారు. జాలి, కరుణ, దయ చూపినప్పుడే మనలోని అందం ద్విగుణీకృతం అవుతుందని, మహిళా సాధికారతకు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కరణంరెడ్డి నరసింగరావు, డాక్టర్ యార్లగడ్డ గీత, ఎన్.పద్మజ, టీకే అగర్వాల్, డాక్టర్ సి. రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రి దశ తిరిగేనా?

» నేడు కేజీహెచ్‌కు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

» కాంప్రహెన్సివ్ కేన్సర్ సెంటర్ ప్రారంభించనున్న మంత్రి

» సమస్యలను ప్రస్తావించేందుకు సిద్ధమవుతున్న అధికారులు

» ఆస్పత్రిని ప్రక్షాళన చేసేలా నిర్ణయాలు తీసుకుంటారని ఆశాభావం



మంత్రి సత్యకుమార్ యాదవ్



విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర పేదల ఆరోగ్య ప్రదాయని కేజీహెచ్‌లో వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమ వారం పర్యటించనున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా తీసుకుని కేన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవ లు అందిం చేందుకు కొనుగోలు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలను ఆయన ప్రారంభించనున్నారు. కాంప్రహెన్సివ్ కేన్సర్ కేర్ సెంటర్‌లో ఈ వైద్య పరికరాలను ప్రభుత్వం ఏర్పాటు చే సింది. వీటి ద్వారా కేన్సర్ రోగులకు అడ్వాన్స్‌డ్ వైద్య సేవందించనున్నారు. ఉదయం 10 గంటలకు మంత్రి రానున్న సందర్భంగా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

మంత్రి ఆస్పత్రిని సందర్శించనున్న నేపథ్యంలో కొన్ని కీలకమైన సమస్యలను అతని దృష్టికి తీసుకువెళ్లేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. గతంతో పోలిస్తే కేజీహెచ్ కు రోగుల తాకిడి పెరిగింది. ప్రతిరోజూ 1500 మంది ఓపీ సేవలకు వస్తున్నారు. మరో 1800 మంది ఇన్‌పేషెం ట్లున్నారు. ఈ నేపథ్యంలో రోగులకు మెరుగైన వైద్య సేవ లు అందించేందుకు వీలుగా మరింత అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. కీలక విభాగాలకు అత్యాధునిక వైద్య పరిక రాలు అందేలా మంత్రి ప్రత్యేక చొరవ చూపాలంటున్నారు. కీలక విభాగమైన నెఫ్రాలజీలో కొన్ని డయాలసిస్ యంత్రాలు పనిచేయడంలేదు. దాతల సహకారంతో సమ కూర్చుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నా ప్రక్రియ ఆలస్యమవుతోది. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. అదనపు యంత్రాలు కేటాయిస్తే వారికి మేలు జరుగుతుంది. కార్డియాలజీ శస్త్రచికిత్సల నిర్వహణలో హార్ట్ లంగ్‌మెషీన్, టెంపరేచర్ కంట్రోల్ మెషీన్లు పనిచేయకపో వడంతో కొన్నిరోజులపాటు ఆపరేషన్లు నిలిచిపోయాయి. వాటిని అద్దె ప్రాతిపదికన అధికారులు సమకూర్చుకు న్నా రు. ఈ పరికరాలను కొనుగోలుచేస్తే సమస్య తప్పుతుంది. క్యాథల్యాబ్ సేవలను మెరుగుపరచాల్సి ఉంది. కొన్ని ఐసీ యూలు సాధారణ వార్డులను తలపిస్తున్నాయి. వాటిని ఆధునికీకరించేందుకు నిధులు అవసరం. కేన్సర్ రోగులకు పెట్‌స్కాన్ చేయాల్సి ఉంది. దీనిపై చాలాకాలంగా అధికారులు విన్నవిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. ఈ స్కాన్ ద్వారా కేన్సర్ శరీరంలో ఎక్కడి వరకు పాకిందో తెలుసుకునే వీలుంది. పూర్తిస్థాయి ఎమర్జెన్సీ బ్లాక్ నిర్మిం చేందుకు ప్రభుత్వ సహకారం అవసరం. ఆస్పత్రిలోని అనేకచోట్ల పేషెంట్ అటెండర్ షెల్టర్లు ఏర్పాటు చేశారు. వీటిలో రోగుల సహాయకులు కనీస అవసరాలు తీర్చుకునే

... మిగతా 4వ పేజీలో

క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం

» కేజీహెచ్‌కు రూ.45 కోట్లతో మూడు పరికరాలు సమకూర్చిన ప్రభుత్వం



లీనియర్ యాక్సలరేటర్



సీటీ సిములేటర్

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం సుమారు రూ.45 కోట్లు వెచ్చించి ప్రభుత్వం మూడు పరికరాలు కొనుగోలు చేసింది. వీటిని సోమవారం ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నారు. ప్రభుత్వం సమకూర్చిన పరికరాల్లో లీనియర్ యాక్సెలరేటర్, హెచ్‌డీఆర్ బ్రాకీ థెరపీ, సీటీ సిమ్యులేటర్ ఉన్నాయి. లీనియర్ యాక్సెలరేటర్ అడ్వాన్స్‌డ్ రేడియేషన్ అందించేందుకు ఉపకరిస్తుంది. హెచ్‌డీఆర్ బ్రాకీ థెరపీ మెషీన్ ద్వారా శరీరంలోని అంతర్గత భాగాల్లో ఉన్న కణతుల లోపలకు రేడియేషన్ ఇవ్వవచ్చు. ఇక సీటీ సిములేటర్ ద్వారా స్కానింగ్ చేస్తారు. ఈ ఇమేజ్‌లు కంప్యూటర్ కాంటోరింగ్ స్టేషన్‌లో పూర్తిస్థాయిలో పరిశీలించి ఏ భాగానికి రేడియేషన్ ఇవ్వాలో గుర్తిస్తారు. దీనివల్ల సూక్ష్మ కణితులు, ఇతర భాగాలపై రేడియేషన్ ప్రభావం పడకుండా చూడవచ్చని వైద్యులు చెబుతున్నారు. వీటి సాయంతో మెదడు నుంచి కాలిబొటని వేలి వరకూ వచ్చే ఏ క్యాన్సర్‌కు అయినా మెరుగైన చికిత్సను అందిస్తామని విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. అర సెంటీమీటర్ నుంచి 40 సెంటీ మీటర్ల పరిమాణం ఉన్న క్యాన్సర్‌కైనా అత్యాధునిక పద్ధతుల్లో వైద్యం అందించే వీలుంటుందన్నారు.



▶ **నర్తన గణపతిగా సంపత్ వినాయగర్**

చవితి మహోత్సవాల్లో భాగంగా సంపత్ వినాయగర్ ఆలయంలోని స్వామివారు ఆదివారం నర్తన గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గణపతి హోమం, ప్రత్యేక అభిషేకాలు చేశారు. కనకమహాలక్ష్మీ దేవస్థానం ఈవో శోభారాణి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. - సిరిపురం, ఆంధ్రజ్యోతి

నోటీసులిచ్చిన దివ్యాంగులకు పింఛన్లు

» గ్రీవెన్స్‌లో వినతులిచ్చిన వారికి నేటి నుంచి పంపిణీ

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వైద్య పరీక్షల్లో అనర్హులుగా తేలిన దివ్యాంగులకు గత నెల పింఛన్లు నిలిపివేశారు. అయితే వారిలో చాలామంది తాము అర్హులమంటూ అధికారులకు విన్నవించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం గ్రీవెన్స్‌లో వినతులిచ్చిన వారందరికీ పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలో సుమారు 1200 మందికి సోమవారం నుంచి పింఛను సొమ్ము పంపిణీ చేయనున్నారు. వైద్య పరీక్షల్లో 40 శాతం కంటే తక్కువ అంగవైకల్యం ఉన్నట్టు నిర్ధారించిన మేరకు జిల్లాలో 1,558 మంది పింఛన్లను గత నెల నిలిపివేశారు. జిల్లాలో రూ.6 వేల చొప్పున పింఛను తీసుకుంటున్న 21,306 మంది దివ్యాంగుల అంగవైకల్యంపై ఈ ఏడాది జనవరి నుంచి కేటగిరీల వారీగా వైద్య పరీక్షలు నిర్వహించారు. నిబంధనల మేరకు 40 శాతం అంగవైకల్యం ఉంటేనే పింఛన్‌కు అర్హులని నిర్ధారించారు. కానీ పరీక్షలలో 1,558 మంది 40 శాతం కంటే తక్కువగా అంగవైకల్యం ఉన్నట్టు ధ్రువీకరించారు. దీంతో వారికి గత నెల పింఛన్ నిలిపివేశారు. దీనిపై కలెక్టరేట్‌లోని ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతులు అందజేయడంతో ప్రభుత్వం స్పందించింది. పింఛన్ నిలిపివేతపై గ్రీవెన్స్ పెట్టుకోవాలని సూచించింది. దీంతో జిల్లాలో ఆదివారం సాయంత్రం వరకు సుమారు 1,200 మంది ఎంపీడీవోలు/జోనల్ కమిషనర్లకు, కలెక్టరేట్‌లో ఫిర్యాదులు చేశారు. వీరికి సోమవారం నుంచి పింఛన్లు అందజేస్తారు. మిగిలిన దివ్యాంగులు కూడా వెంటనే గ్రీవెన్స్ పెట్టుకోవాలని అధికారులు సూచించారు. ఇదిలా వుండగా ఆగస్టు నెలకు సంబంధించి జిల్లాలో 1,60,429 మందికి రూ.70.05 కోట్లు పింఛన్ సొమ్ము విడుదలైంది. నాలుగు గ్రామీణ మండలాల్లో 26,636 మందికి రూ.11.20 కోట్లు, జీవీఎంసీ పరిధిలో 1,33,793మందికి రూ.58.85 కోట్లు విడుదల కాగా శనివారమే సచివాలయాల సిబ్బందికి అందజేశారు.

ఆర్టీసీ సిబ్బందికి అవస్థలు

ఎంవీపీ బస్టాండ్‌లోని విశ్రాంతి భవనంలో కనీస వసతులు కరవు

» రేకుల పైకప్పుతో నిత్యం వేడి వాతావరణం

» తిరగని ఫ్యాన్లతో తీవ్ర ఉక్కపోత

» దూరప్రాంత సర్వీసుల డ్రైవర్లకు తప్పని తిప్పలు

» ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



ఎంవీపీ బస్‌స్టేషన్‌లోని డ్రైవర్ల విశ్రాంతి భవనంలో తిరగని ఫ్యాన్‌లు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ఆర్టీసీ దూరప్రాంత సర్వీసుల సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు ఎంవీపీకాలనీ బస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విశ్రాంతి భవనంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. సుదీర్ఘసమయం విధి నిర్వహణ చేసి విశ్రాంతి తీసుకునేందుకు భవనంలోకి వెళితే కనీసం కూర్చొనేందుకు కూడా అవకాశం లేకుండా పోతోందని సిబ్బంది వాపోతున్నారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా కనీసం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

విజయవాడ, అమలాపురం, రాజోలు, తాడేపల్లిగూడెం, తెనాలి డిపోల నుంచి నగరానికి కొన్ని ఆర్టీసీ బస్సులు వచ్చి, వెళుతుంటాయి. ఈ సర్వీసుల్లో డ్రైవర్లు, కండక్టర్లు సుమారు పది నుంచి 12 గంటలు పాటు ఏకధాటిగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వారంతా నగరానికి చేరుకున్న తర్వాత విశ్రాంతి తీసుకునేందుకు ఎంవీపీబస్‌స్టేషన్ ఆవరణలో భవనం నిర్మించారు. బస్సులు ఇక్కడికిచేరుకున్న తర్వాత అప్పటివరకు విధులు నిర్వర్తించిన డ్రైవర్, కండక్టర్ విశ్రాంతి భవనంలో

... మిగతా 4వ పేజీలో

రేషన్ డిపోలకు స్మార్ట్ రైస్ కార్డులు

నేటి నుంచి కార్డుదారులకు అందజేత

పంపిణీలో ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన

» సచివాలయాలకు ఇస్తేనే మేలని సూచన



బర్మాక్యాంపు రేషన్ డిపో వద్ద స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వం కొత్తగా ముద్రించిన డిజిటల్ స్మార్ట్ రైస్ కార్డులు పూర్తిస్థాయిలో రేషన్ డిపోలకు చేరాయి. వాటిని డిపోల్లోనే డీలర్లు సోమవారం నుంచి కార్డుదారులకు పంపిణీ చేయనున్నారు. సెప్టెంబరు 15వ తేదీ వరకు డిపోల్లో కార్డులు అందజేస్తారని జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ తెలిపారు. అయితే ఆగస్టు మూడోవారంలోనే జిల్లాకు స్మార్ట్ రైస్‌కార్డులు చేరుకోగా, తొలుత సచివాలయాలకు అందజేశారు. ఆ తరువాత కొన్నింటిని డిపోల ద్వారా పంపిణీ చేశారు.

ఇప్పటివరకు జిల్లాలో 5,17,155 కార్డులకుగాను 1,76,100 (34శాతం) కార్డులను సంబంధిత లబ్ధిదారులకు అందజేశారు. వీటిలో సచివాలయాల ద్వారా 1,28,766, డిపోల నుంచి 47,334 పంపిణీ చేశారు. కార్డుల పంపిణీలో నాలుగు గ్రామీణ మండలాలు ముందుండగా నగరంలో వెనుకబడి ఉంది. ఇంకా మిగిలిన 3,41,055 కార్డులను డిపోలకు పంపించారు. కార్డుల పంపిణీపై ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల్లో మార్పులు చేయడంతో కొంత గందరగోళం నెలకొంది. సచివాలయాల్లో వీఆర్వోల ద్వారా కార్డుల పంపిణీ చేయాలని మొదట ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి కార్డుదారునికి కార్డుఇచ్చే ముందు అతని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని సూచించింది. అయితే కార్డుల పంపిణీని వీఆర్వోలు వ్యతిరేకిస్తూ వచ్చారు. సచివాలయాల పరిధిలో అనేక సర్వేలు, ఇతరత్రా విధులు నిర్వహిస్తున్నందున ఈ ప్రక్రియ పూర్తిచేయలేమని వారంతా చెప్పేశారు. అయినా ఉన్నతాధికారుల ఆదేశాలతో కొన్ని సచివాలయాల పరిధిలో కార్డుల పంపిణీ ఇష్టానుసారంగా సాగిందనే ఆరోపణలున్నాయి. కార్డులు పంపిణీచేసే ముందు గతంలో ఉన్న బియ్యం కార్డు , సంబంధిత కార్డుదారుని వేలిముద్ర తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా కొన్నిచోట్ల పంపిణీ చేశారనే విమర్శలున్నాయి.

ఇదిలావుండగా సోమవారం నుంచి డిపోల ద్వారా కార్డుల పంపిణీ చేపట్టాలని జిల్లా

... మిగతా 4వ పేజీలో

ఈవోఐలను ఉపసంహరించుకోవాలి

» మహా ధర్నాలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు



కూర్మన్నపాలెంలో ధర్నాలో పాల్గొన్న సిహెచ్.నరసింగరావు, మంత్రి రాజశేఖర్, డి. ఆదినారాయణ, జె.అయోధ్యరామ్ తదితరులు

కూర్మన్నపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారంలో ప్రభుత్వ యాజమాన్యాలు ప్రకటించిన ఈవోఐలను ఉపసంహరించుకోవాలని విశాఖ ఉక్కు పోరాట కమిటీ ప్రతినిధులు సీహెచ్ నరసింగరావు, మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కూర్మన్నపాలెం జంక్షన్‌లో చేపట్టిన మహాధర్నాలో నరసింగరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంటు చరిత్ర పోరాటాలతో ముడిపడి ఉందన్నారు. వాటి ఫలితంగా దేశవ్యాప్తంగా పాలక, ప్రతిపక్ష నాయకులు ఉద్యమాన్ని గౌరవిస్తున్నారన్నారు.పాలకులు దానిని తగ్గించాలని చూస్తే ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. తక్షణమే ఈవోఐలను రద్దు చేయకుంటే ప్రజాగ్రహాన్ని చవిచూస్తారని హెచ్చరించారు.

ఉక్కు పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ నాడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను తప్పారన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, చేస్తున్న వింత ప్రకటనలతో ఉక్కు కార్మికుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. ఉక్కు యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలతో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని, వాటిని సత్వరం పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. పోరాట కమిటీ ఛైర్మన్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఉపాధి లభిస్తుందని నాటు కారు చౌకగా భూములిచ్చిన నిర్వాసితులను మోసం చేయడం దారుణమన్నారు. ఈవోఐలను తక్షణమే రద్దుచేయాలన్నారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నేత పి. మణి, పోరాట కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, ఎస్.రామారావు, గణపతిరెడ్డి, ఇంటక్ రమణమూర్తి, వి.ప్రసాద్, జె. రామకృష్ణ, దొమ్మేటి అప్పారావు, సీహెచ్ సన్యాసిరావు పాల్గొన్నారు.

జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌గా సత్యనారాయణరాజు



సీఈ సత్యనారాయణరాజు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌గా పీవీవీ సత్యనారాయణరాజుని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రజారోగ్య ఇంజనీరింగ్ విభాగంలో సూపరింటెండెంట్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న పదిమందికి చీఫ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించింది. జీవీఎంసీలో ఎస్ఈలుగా పనిచేస్తున్న పీవీవీ సత్యనారాయణరాజుతోపాటు వై.కృష్ణారావుకు పదోన్నతి లభించింది. సత్యనారాయణరాజుకు జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌గా పోస్టింగ్ ఇవ్వగా కృష్ణారావుకు ఏపీ టిడ్కో సీఈగా డిప్యూటేషన్‌పై నియమించింది. జీవీఎంసీలో ప్రస్తుతం పూర్తిస్థాయి చీఫ్ ఇంజనీర్ లేకపోవడంతో ఎస్ఈ పి.పల్లంరాజు ఇన్‌చార్జి సీఈగా కొనసాగుతున్నారు.

ఆటోను ఢీకొట్టిన బైక్

» ఇద్దరు యువకులు, ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

» ఒకరి పరిస్థితి విషమం

» సరిపల్లి సర్వీసు రోడ్డు వద్ద ప్రమాదం



తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్



ప్రమాద దృశ్యం

పెందుర్తి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్రంగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన పెందుర్తి సమీప సరిపల్లి సర్వీసు రోడ్డు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి... పెందుర్తి మండలం సరిపల్లిలోని ఒకే కుటుంబానికి చెందిన కండిపల్లి కన్నయ్య, భార్య దేవి, కుమార్తె భారతి, కోడలు నాగమణి తమ సొంత ఆటోలో అక్కిరెడ్డిపాలెంలోని బంధువుల ఇంటి పుట్టినరోజు వేడుకకు ఆదివారం రాత్రి బయలుదేరారు. సర్వీసు రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా అత్యంత వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు తుళ్లి, రోడ్డుపై పడిపోయారు. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. కాగా ఆటో డ్రైవర్ కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో కెజీహెచ్‌కు తరలించారు. గాయపడిన యువకులు చినముషిడివాడకు చెందిన వారిగా గుర్తించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.



వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యురాలు

71 మందికి నేత్ర వైద్య పరీక్షలు

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నగరపాలెంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 71 మంది రోగులను పరీక్షించి 32 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. వారికి వచ్చే నెల 2వ తేదీన నగరంలోని నాయుడుతోట వద్ద శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పోతిన అప్పారావు జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యుల సౌజన్యంతో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యులు సీహెచ్ గిరిజ, వెంకటరమణ, స్థానికులు చంద్రశేఖర్, సతీశ్, సురేంద్ర, గోపి, జగదీశ్, సాయికుమార్ , తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో ఎరువుల వ్యాపారికి మెమో

పద్మనాభం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా సరఫరాలో ఇబ్బందులు కలిగిస్తూ బలవంతంగా దుబ్బు గుళికలు అంటగడుతున్న రెడ్డిపల్లికి చెందిన ఎరువుల దుకాణదారునికి మండల వ్యవసాయాధికారి చలం మెమో జారీ చేశారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దుకాణ యజమాని మండలంలోని రైతులకు కాకుండా వేరే మండలాలకు చెందిన వారికి ఎరువులు సరఫరా చేస్తున్నారని ఆరోపణలు రావడంతో విజిలెన్సు అధికారుల సూచన మేరకు కొన్ని రోజులు అమ్మకాలు నిలిపివేయించామన్నారు. స్టాక్ పరిశీలించిన తరువాత రైతులకు యూరియా మాత్రమే విక్రయించాలని చెప్పగా బలవంతంగా దుబ్బు గుళికలు అంటగడుతుండడంతో మెమో జారీ చేశామని చెప్పారు.

ఇండోర్ స్టేడియంలో సౌకర్యాల లేమి

భీమునిపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు కనీస సదుపాయాలు కల్పించాలని బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కారి ఈశ్వరరావు కోరారు.ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2018లో అప్పటి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇండోర్ స్టేడియం ప్రారంభించారన్నారు. నాటి నుంచి నిర్వహణ లేక, తగిన సదుపాయాలు లేక క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ముఖ్యంగా వూడెన్ ఫ్లోరింగ్ లేక ముడుకులు, కాళ్ల నొప్పులతో అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే విద్యుత్ లైటింగ్, తాగునీటి సౌకర్యం లేదని తెలిపారు. ఈ సమస్యలను ఇటీవల నగర పర్యటనకు వచ్చిన విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు

మధురవాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వారంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా మధురవాడ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నగరానికి చెందిన జోష్ డ్యాన్స్ అకాడమీ కళాకారులు ఆకాంక్ష, హాసిని, దీక్ష, భవ్య, రాణి, సంజన, మాన్విత, నవ్య పలు గీతాలకు నృత్య రీతులు సమకూర్చారు.

పలు గ్రామాల్లో అన్నసమారాధన

పద్మనాభం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది, ఇసకలపాలెం,కృష్ణాపురం గ్రామాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాల వద్ద ఆదివారం అన్నసమారాధనలు నిర్వహించారు. ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని జరిపారు. సుమారు ఆరు వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఇకసలపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా మాజీ అధ్యక్షుడు హంస మహేశ్,కమిటీ ప్రతినిధులు బోని రమణ, బుగత రమణ, సూరిబాబు, గౌరినాయుడు, సన్యాసినాయుడు, రమణ పాల్గొన్నారు.

గణేశ్ ప్రతిమను సందర్శించిన చిన్న శ్రీను

మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని చంద్రంపాలెంలో ఏర్పాటు చేసిన 41 అడుగుల భారీ గణేశ్ ప్రతిమను విజయనగరం జడ్పీ చైర్మన్, వైసీపీ భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.



ఇస్కాన్‌లో రాధాకృష్ణుల ప్రత్యేక అలంకరణ



హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం

ఇస్కాన్‌లో ఘనంగా రాధాష్టమి వేడుకలు

సాగర్‌నగర్/ఆనందపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో రాధాష్టమి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున 4.30 గంటలకు మంగళ హారతి, ఉదయం 8 గంటలకు దర్శన హారతి, 9 నుంచి హరినామ సంకీర్తన, 11 గంటలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఇస్కాన్ విశాఖపట్నం అధ్యక్షుడు సాంబదాసు, మాతాజీ నితాయిసేవనిలు భక్తులకు రాధాకృష్ణ లీలలపై ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఆనందపురం మండలంలోని గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలోనూ రాధాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్మెంట్ అధ్యక్షుడు యదురాజ దాస మాట్లాడుతూ కృష్ణాష్టమి తర్వాత 15 రోజులకు వచ్చే బాద్రపద శుక్ల అష్టమిని రాధాష్టమిగా పిలుస్తారని తెలిపారు. రాధ అంటే సాక్షాత్తు శ్రీకృష్ణుడి అంతరంగిక శక్తి స్వరూపిణి అని చెప్పారు. తొలుత రాధాకృష్ణ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. అనంతరం 108 జల కలశాలతో, పళ్ల రసాలు, పంచామృతం, పంచగవ్యాలతో అభిషేకం నిర్వహించారు.

భవనం పైనుంచి జారి పడి కార్మికురాలి మృతి

సాగర్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పెద్ద రుషికొండ ఐటీ హబ్‌లో ఉన్న ఆదిత్య అపార్టుమెంట్ వెనుక ప్రాంతంలో నిర్మాణంలో వున్న బహుళ అంతస్తు భవనం పైనుంచి ప్రమాదవశాత్తు జారి పడి భవన నిర్మాణ కార్మికురాలు మృతి చెందింది. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. ఆరిలోవలోని తోటగరువు ప్రాంతానికి చెందిన చందక సింహాచలం, సత్యాలు (48) కొద్ది రోజులుగా ఆదిత్య అపార్టుమెంట్ వెనుక నిర్మాణంలో వున్న బహుళ అంతస్తు భవనంలో పనిచేస్తున్నారు. ఈమేరకు ఆదివారం రెండో అంతస్తులో పనికి వెళ్లిన సత్యాలు కళ్లు తిరిగి అక్కడి నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందింది. భవనం యజమాని సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

ఏడుగురిని కాపాడిన లైఫ్‌గార్డులు



సాగర్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానాలు చేస్తూ ప్రమాదానికి గురైన ఏడుగురిని లైఫ్‌గార్డులు రక్షించారు. ఆదివారం అల్లిపురం ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఆరుగురు పర్యాటకులు రుషికొండ బీచ్‌కు విహారానికి వచ్చారు. అందరూ సముద్ర స్నానాలు చేస్తుండగా అల్లిపురంనకు చెందిన సాయి (27) ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఎన్. చంద్రాకర్ (24), అంజు బగేల్ (26), కుష్బూ యాదవ్ (33), గౌరవ్ సాహు (24), అరుషి సింగా (23), రోహన్ చంద్రాకర్ (28) ప్రమా దానికి గురయ్యారు. పెద్ద అల తాకిడికి వారు సముద్రంలోకి కొట్టుకుపోతుండగా సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న లైఫ్ గార్డులు గమనించి రక్షించారు.



జోడుగుల్లపాలెంలో క్రేన్‌తో గణేశ్ ప్రతిమ నిమజ్జనం



ఆకట్టుకున్న దీపారాధన

కొనసాగుతున్న వినాయక నిమజ్జనాలు

విశాలాక్షినగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని జోడుగుళ్లపాలెం తీరంలో వినాయక నిమజ్జనాలు ఆదివారం కూడా కొనసాగాయి. ఐదు రోజుల ఉత్సవాల అనంతరం నిర్వాహకులు వినాయక ప్రతిమలను తీరానికి తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. ఒక భారీ క్రేన్‌తో పాటు మరో చిన్న క్రేన్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. అలానే సుమారు 80 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. కాగా విశాలాక్షినగర్ రెవెన్యూ కూడలిలో ఉత్తమ్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి మండపం ఆవరణలో దీపారాధన చేపట్టారు. అమ్మవారు, వినాయక ఆకారంలో ఏర్పాటు చేసిన మహిళలు దీపాంకరణ చేశారు.



గొల్లలపాలెంలో మంచు శివలింగం

భీమిలి తీరంలో...

భీమునిపట్నం : పట్టణంలోని గోస్తనీ, సాగర సంగమంలో ఆదివారం పలు వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. విజయనగరం,శ్రీకాకుళం నుంచే కాకుండా భీమిలి పరిసర ప్రాంతాల నుంచి వ్యాన్‌లు, లారీలతో విగ్రహాలను బీచ్‌కు తీసుకురావడంతో తీరం సందడిగా మారింది. విద్యుత్ దీపాల వెలుగులో లైన్ వారీగా విగ్రహాలను క్రేన్‌ల సహకారంతో సముద్రంలో నిమజ్జనం చేశారు. నార్త్ ఏసీపీ అప్పలరాజు ఈ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు. సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

ఆకట్టుకున్న మంచు శివలింగం

గొల్లలపాలెంలో జీపీఎల్ యూత్ ఆధ్వర్యంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం విఘ్నేశ్వర మండపం వద్ద మంచు శివ లింగం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో మంచు శివలింగాన్ని దర్శించుకుని దీపారాధన చేశారు.

బైక్ బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలు

మహారాణిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై బైక్ బోల్తా పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివ రాలు ప్రకారం.. ఓల్డ్ ఐటీఐ ప్రాంతానికి చెందిన రాజేష్ (25), ఉదయ్ (27) ఆదివారం సాయంత్రం బైక్‌పై ఆర్‌కే బీచ్‌కు వెళ్లారు. రాత్రి అక్కడి నుంచి సంపత్‌వినాయక టెంపుల్ మీదుగా తిరిగి వస్తుండగా ఫ్లైఓవర్‌పై బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి.

రైల్వే న్యూకాలనీలో రౌడీ షీటర్ల కొట్లాట

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతుండగా మాటా మాటా పెరిగిపోవడంతో ఇరువర్గాల రౌడీషీటర్ల మధ్య కొట్లాట జరిగింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఫోర్త్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైల్వేన్యూకాలనీ సాయిబాబా ఆలయం వెనుకవైపున శనివారం అర్ధరాత్రి సమయంలో కొందరు పేకాట ఆడుతున్నారు.అక్కడికి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్న ఖాజా వెళ్లాడు. అప్పటికే అక్కడ కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ వున్న దండేశ్వరరావు, మరగడ గురునాథరెడ్డి అలియాస్ బాబ్జితోపాటు మరికొందరు ఉన్నారు. పేకాట విషయంలో ఖాజాకు దండేశ్వరరావ్ల మధ్య వాగ్వాదం జరగడంతో ఇద్దరూ కొట్లాడుకున్నారు. పక్కనే ఉన్న రౌడీషీటర్ బాబ్జీతోపాటు మరో ఐదుగురు కలిసి ఇనుపరాడ్లతో ఖాజా తలపై బాదడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. దీతో స్థానికులు డయల్ 100కు సమాచారం అందించడంతో ఫోర్త్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఖాజాను ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన నిందితులు పరారవడంతో వారికోసం పోలీసులు గాలిస్తున్నారు.

మత్తు ప్రేమికుల మధ్యలో 'మద్దీ'

(విజయవాడ, ఆంధ్రజ్యోతి)

వైజాగ్ ప్రేమికులకు ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను సమకూర్చిన మల్లెల మధుసూదన్‌రెడ్డి అలియాస్ మద్దీ ఎవరు ? డ్రగ్స్ పురమా యించిన లోహిత్ యాదవ్‌కు, మద్దీకి పరిచయం ఎలా ఏర్పడింది? వైజాగ్ తీరానికి మాదక ద్రవ్యాలు బెంగళూరు నుంచే వెళ్తున్నాయా? అంటే దర్యాప్తు బృందాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను బెంగళూరు నుంచి ట్రావెల్స్ బస్సులో వైజాగ్ తీసుకెళ్తుండగా, అర్బాల శ్రీవాత్సవ్, బొడ్డేపల్లి హవీల డిలైట్ అనే ప్రేమికులను ఈగల్ పోలీసులు విజయవాడలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారిద్దరికీ కోర్టు రిమాండ్ విధించింది. శ్రీవా త్సవ్‌తో ఎండీఎంఏ డ్రగ్‌ను రప్పిస్తున్న వైజాగ్‌కు చెందిన లోహిత్ యాదవ్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. మద్దీ సొంతూరు నెల్లూరు. డిగ్రీ చదివాడు. ఉపాధి కోసం బెంగళూరువెళ్లి ఎండీఎంఏను యువతకు సరఫరా చేయడం మొదలు పెట్టాడు. శ్రీవాత్సవ్, హవీల నుంచి ఫోన్‌పే ద్వారా డబ్బు అందుకుని ఎండీఎంఏను సమకూర్చాడు. బెంగళూరు మెట్రో రైల్వేస్టేషన్లకు సమీపంలో ఖాళీ ప్రదేశాలను,దుకాణాలను డ్రాపింగ్ పాయింట్లుగా చేసుకున్నాడు. డబ్బు ఖాతాలో జమకాగానే, డ్రాపింగ్ పాయింట్ ఫొటో, లొకేషన్‌ను వాట్సాప్‌లో పంపుతాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఖాళీ సిగరెట్ ప్యాకెట్లలో డ్రగ్‌ను అమర్చుతాడు. శ్రీవాత్సవ్, హవీల విజయవాడలో పోలీసులకు దొరికిపోయారని తెలియడంతో మద్దీ పరారయ్యాడు. వైజాగ్‌లో ఉన్న లోహిత్ యాదవ్‌కు మద్దీ ఎలా పరిచయమయ్యాడు, ఎంతమంది అతడితో సంప్రదింపులు చేశారనేదానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. కాగా శ్రీవాత్సవ్, హవీల ప్రేమికులు. వీరి ఫోన్లను సీజ్ చేసిన పోలీసులు సాంకేతికంగా విశ్లేషిస్తున్నారు. శ్రీవాత్సవ్ ఫోన్ గ్యాలరీలో హవీలతో కలిసి డ్రగ్స్ తీసుకుంటున్న వీడియోలు, ఫొటోలు ఉన్నాయి. వాటినే సాక్ష్యాలుగా పోలీసులు కోర్టుకు అందజేయనున్నారు.

పెద్దాస్పత్రి దశ తిరిగేనా?

... 3వ పేజీ తరువాయి

సదుపాయాలు లేవు. కొన్నిచోట్ల చోరీలు జరుగుతున్నాయి. వర్షం వస్తే ఉండలేని పరిస్థితులున్నాయి.

వైద్యులపై దృష్టి సారించాలి..

కొన్నాళ్లుగా కీలకకేసుల్లో ఆస్పత్రి వైద్యుల పాత్ర బహి ర్గతమవుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి వైద్యులకు హెచ్చరికలు జారీచేయాల్సి ఉంది. కీలక స్థానాల్లోని అధికారులు, విభాగాధిపతులు ప్రైవేటు సేవల్లో తరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆస్పత్రి పనివేళల్లో కొందరు వైద్యులు ప్రైవేటుకు ప్రాధాన్యతనిస్తుండడంతో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదనే విమర్శలున్నాయి. వీటిపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించాలి.

భవనాలపై దృష్టి సారించేనా.?

గత ప్రభుత్వ హయాంలో ఆస్పత్రిలోని కొన్ని విభాగాల భవనాలను కూల్చివేశారు. నూతన భవనాలకు ప్రతిపాదనలు చేసి నాడు-నేడులో భాగంగా పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. నిధులు మంజూరు చేయకపోవడం, ఇతర కారణాలతో పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో నూతన భవన నిర్మాణాలు చేపట్టేలా మంత్రి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేషన్ డిపోలకు స్మార్ట్ రైస్ కార్డులు

... 3వ పేజీ తరువాయి

అధికారులు ఆదేశించారు. దీనిపై కార్డుదారులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఎండీయూ వాహనాలు వచ్చిన తరువాత నాలుగేళ్ల నుంచి డీలర్లకు, కార్డుదారుల మధ్య సంబంధాలు చాలా వరకు నిలిచిపోయాయి. ఎండీయూలు వచ్చిన తరువాత నగరంలో చాలా వరకు డిపోలు వేర్వేరు చోట్లకు తరలించారు. మూడు నెలల క్రితం ఎండీయూలు రద్దుచేసిన తరువాత తిరిగి సరకుల పంపిణీ బాధ్యత డిపోలకు అప్పగించారు. ఈ కాలంలో కార్డుదారులను మ్యాపింగ్ చేసిన డిపోలకు కాకుండా తమకు అందుబాటులో ఉన్న డిపోల నుంచి సరకులు తీసుకుంటున్నారు. మ్యాపింగ్ అయిన కార్డుదారుల కోసం కొందరు డీలర్లు అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్మార్ట్ కార్డుల పంపిణీ రేషన్ సవాల్‌గా మారుతుందని డీలర్లు చెబుతున్నారు. శనివారం ఆరిలోవలో ఒక డిపో వద్ద కార్డుల పంపిణీ కోసం వేచి వున్న పలువురి కార్డులు డిపోలో లేవని తేలడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ సిబ్బందికి అవస్థలు

... 3వ పేజీ తరువాయి

ఉండిపోతే, వారిస్థానంలో మరోడ్రైవర్, కండక్టర్ డ్యూటీ ఎక్కి బస్సుని తిరిగి విజయవాడ, అమలాపురం, రాజోలు, తాడేపల్లిగూడెం, తెనాలి వంటి దూర ప్రాంతాలకు వెళతారు. అక్కడి నుంచి వచ్చిన డ్రైవర్లు, కండక్టర్లు విశ్రాంతిభవనంలో నిద్రపోయి మరుసటిరోజు ఉదయం తిరిగి డ్యూటీ ఎక్కుతారు. అయితే విశ్రాంతి భవనంలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఈ భవనంలో 13 మంచాలు ఫ్యాన్‌లను ఏర్పాటు చేశారు. ఒకటి, రెండు మినహా మిగిలిన ఫ్యాన్‌లు తిరగడం లేదు. దీంతో తీవ్ర ఉక్కపోతతో సిబ్బంది సతమతమవుతున్నారు. మరోవైపు విశ్రాంతి భవనం పైకప్పు సిమెంట్ రేకులతో నిర్మించడంతో చిన్నపాటి ఎండకాస్తే ఉక్కపోత, వేడి పెరిగిపోతోందని వాపోతున్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదుచేసినా కనీసం స్పందనలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుదూరప్రాంతాల నుంచి బస్సులో విధులు నిర్వర్తించి, విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో కనీసం కూర్చోవడానికి కూడా అవకాశం లేని దుర్భర పరిసితులు నెలకొనడంతో, మరుసటిరోజు విధి నిర్వహణ సవాల్‌గా మారుతోందని వాపోతున్నారు. అధికారులు సిబ్బంది సంక్షేమంతో పాటు ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని విశ్రాంతి భవనంలో సమస్యలను పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



మహారాణిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : గోకుల్ బీచ్ రోడ్డు వద్ద బార్ వెనుక భాగంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో వింటేజ్ బార్ వెనుక మృతదేహం ఉన్నట్టు స్థానికులు గుర్తించి, మహారాణిపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతుడు భీమునిపట్నంకు చెందిన ఎల్లాజీ (30)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్వాంటం కంప్యూటింగ్ టూల్స్‌పై అవగాహన

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : క్వాంటం కంప్యూటింగ్‌లో టూల్స్ వినియోగం అత్యంత కీలకమని కేఎల్ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్, క్వాంటం కంప్యూటింగ్ నిపుణుడు డాక్టర్ కె. భానుప్రకాశ్ అన్నారు. ఏయూలోని కంప్యూటర్ సైన్స్ ఆల్గారిదమ్ సెమినార్ హాల్‌లో మూడు రోజులుగా క్వాంటం కంప్యూ టింగ్ ఇన్ సైట్స్ ఫర్ అకడమీషన్స్ ప్రోగ్రామ్ పేరుతో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో భానుప్రకాశ్ మాట్లాడుతూ క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన సెక్యూరిటీ ప్రొవైడింగ్ సిస్టమ్స్ గురించి వివరించారు. భవిష్యత్‌లో గొప్ప అవకాశాలను క్వాంటం కంప్యూటింగ్ నిపుణులు దక్కించుకుంటారన్నారు. కోల్‌కతాలోని టీసీఎస్ కంపెనీ టెక్నికల్ లీడ్ అండ్ క్వాంటం రీసెర్చర్ రాహుల్ రాణా మాట్లాడుతూ క్వాంటం ఆప్టమైజేషన్‌కు సంబంధించిన టెక్నిక్స్‌ను వివరించారు. ఏయూ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.వెంకటరావు మాట్లాడుతూ క్వాంటం కంప్యూటింగ్ అంటే ఏమిటి, సూపర్ పొజిషన్, ఎంటాంగిల్‌మెంట్, దాని ఉపయోగాలు వంటి అంశాలను తెలిపారు. దేశంలో క్వాంటం కంప్యూటింగ్ కోర్సును ప్రారంభించిన వర్సిటీగా ఏయూ గుర్తింపు సాధించినట్టు చెప్పారు. ఏపీ ప్రభుత్వం, నేషనల్ క్వాంటం మెషిన్‌లో భాగంగా క్వాంటం టెక్నాలజీని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈక్రమంలోనే అమరావతిలో క్వాంటం కంవ్యాలీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఈ కార్యక్ర మంలో ఓషూ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ కో-ఫౌండర్ అండ్ ఎండీ ఎస్. భానుమూర్తి, సదస్సు కో-కన్వీనర్లు డాక్టర్ కె. రాజ్ కుమార్, డాక్టర్ కేవీ రమణ, ప్రొఫెసర్ శశి, ప్రొఫెసర్ వల్లీ కుమారి, ప్రొఫెసర్ లలితా భాస్కరి తదితరులు పాల్గొన్నారు.

రౌతులపాలెం మహిళకు ఏయూ డాక్టరేట్

పద్మనాభం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రేవిడి పంచాయతీ రౌతులపాలెంకు చెందిన రుద్రాక్ష గౌరీ దేవి గ్రంథాలయ సమాచార శాస్త్రంలో ఏయూ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ప్రైవేటు కళాశాలలో గ్రంథాలయ అధికారిగా పని చేస్తున్న ఆమె ఏయూలో లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సులో 'పాటర్న్ అండ్ యూజ్ ఆఫ్ ఆన్ లైన్ రీసోర్సెస్ బై యూనివర్సిటీ స్టూడెంట్స్ ఫర్ అకడమిక్ పర్పస్ ఏ స్టడీ అన్న అంశంపై ఆచార్య ధనరాజు ఆధ్వర్యంలో పరిశోధన చేశారు. ఈమేరకు వీసీ రాజశేఖర్ శనివారం డాక్టరేట్ ఇచ్చారు.

అప్పన్న సన్నిధిలో ఉంగుటూరు ఎమ్మెల్యే

సింహాచలం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని ఏలూరు జిల్లా ఉంగుటూరు ఎమ్మెల్యే పి. ధర్మరాజు ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఎమ్మెల్యే గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.



ఎమ్మెల్యేకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఈఓ

ఐటీ అసోసియేషన్ నూతన కార్యవర్గం

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఐటీ కార్యాలయంలో ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా ఇంద్రజిత్ అన్నె, కార్యదర్శిగా శ్రీధర్ సరగడం, కోశాధికారిగా అనుపమ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దాసరి కిశోర్ ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని ఐటీ, ఐటీ ఆధారిత సేవలందించే ప్రముఖ సంస్థల ప్రతినిధులు ఇందులో సభ్యులుగా ఉంటారు.

క్యారమ్స్‌లో విశాఖ క్రీడాకారుల సత్తా



పురుషుల విభాగంలో ప్రథమ బహుమతి అందుకుంటున్న జనార్ధనరెడ్డి, మహిళల విభాగంలో ప్రథమ బహుమతి అందుకుంటున్న భవాని

చిలకలూరిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సీఆర్ క్లబ్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీల్లో విశాఖ క్రీడాకారులు సత్తా చాటారు. పురుషుల, మహిళల విభాగాల్లో సీహెచ్ జనార్దన్‌రెడ్డి, ఎ. భవాని ప్రథమ బహుమతులు అందుకున్నారు. రాష్ట్ర క్యారమ్ సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్, టోర్నమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి ఎస్‌వీ రమణమూర్తి, అబ్జర్వర్ గద్దె వేణు పాల్గొన్నారు. జనార్దన్ రెడ్డికి క్యారమ్ మాల్దీవుల్లో జరిగే ప్రపంచ కప్ పోటీలకు వెళ్లేందుకు గాను సీఆర్ క్లబ్ తరఫున కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు రూ. లక్ష ఆర్థిక సాయం అందించారు.

వృద్ధుడి అదృశ్యం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలేనికి చెందిన మాదాబత్తుల అప్పలరాజు (65) అనే వ్యక్తి కనిపించడం లేదంటూ ఎంవీపీ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. నక్కవానిపాలెంలో మాదాబత్తుల అప్పారావు కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆయన తండ్రి అప్పలరాజు మానసిక వైద్య చికిత్స పొందుతున్నారు. ఆగస్టు 28వ తేదీ రాత్రి ఏడు గంటల సమయంలో అప్పలరాజు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, కుటుంబ సభ్యుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. హెచ్‌సీ రమా శంకర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో ప్రగతిశీల శిక్షణ

వెంకోజీపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో వైద్యుల నైపుణ్యాలను పెంపొందించేందుకు గాను మెడికవర్ ఆస్పత్రి, ఒలింపస్ మెడికల్ సిస్టమ్ సంయుక్తంగా ఒకరోజు ప్రగతిశీల శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ఇక్కడి మెడికవర్ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్ (ఈబీయూఎస్)పై దృష్టి సారించి దేశవ్యాప్తంగా పల్మనాలజీ నిపుణులకు అత్యాధునిక శిక్షణను అందించడమే తమ లక్ష్యమన్నారు. ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల నివారణ, చికిత్సలో కీలకమైన ఈబీయూఎస్ టెక్నాలజీపై వైద్యులకు సుదీర్ఘమైన సిద్ధాంత, ప్రయోగిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నామన్నారు. ప్రముఖ పల్మనాలజిస్టులు డాక్టర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ సుధీర్‌తాలే మాట్లాడుతూ ఆధునిక వైద్య శిక్షణను భారతదేశానికి తీసుకురావడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

డీఎస్సీ నియామకాల్లో అవకతవకలను సరిదిద్దాలి

మద్దిలపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-25 పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ నియామక పక్రియలో క్షేత్ర స్థాయిలో జరుగుతున్న అవకతవకలను వెంటనే సరిదిద్దాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పదేళ్ల తర్వాత విడుదలైన 16,347 ఉపాధ్యాయ పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 5.77 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆయా పోస్టుల భర్తీలో నిర్లక్ష్యం, అవకతవకలు చోటుచేసుకోవడంతో అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారన్నారు.

మెరుగైన సేవలందించాలి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపరచాలని ఉక్కు కార్మిక సంఘ నాయకులు కోరుతున్నారు. ఇటీవల కాలంలో చాలా మంది ఉద్యోగులు వీఆర్ఎస్, పదవీ విరమణ చేయడంతో చాలా వరకు వైద్య సేవలు తగ్గిపోయాయన్నారు. వైద్యులను నియమించి, పూర్తి స్థాయిలో సేవలందించాలని పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 38, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 36, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 50, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 86, కీరదోస 30, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	113
లైవ్ ధర	133
విత్ స్కిన్	236
స్కిన్‌లెస్	246

గణనాథులకు ప్రత్యేక పూజలు

పలు మండపాల వద్ద హోమాలు, అన్న సమారాధనలు

వెంకోజీపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పలుచోట్ల ప్రతిష్ఠించిన గణనాథులకు, ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరిపారు. ఇందులో భాగంగా కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా గణపతి హోమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సంఘం ప్రతినిధులు ఆడారి సత్యనారాయణ, పీలా ప్రేమ్‌కిరణ్ జగదీశ్, గ్రామస్తులు మద్దాల వీరవెంకట అప్పారావు, ధనరెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పాత వెంకోజీపాలెంలో శ్రీసీతారామ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం భజన కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీసీతారామ సేవా సంఘం ప్రతినిధులు మళ్ల పోలిరాజు, కర్రి వెంకట సూరిఅప్పారావు, మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, జనసేన నాయకుడ పీల వెంకట పరదేశినాయుడు, తదితరులు పాల్గొన్నారు. కాగా కృష్ణా కళాశాల మార్గంలోని ఎలియన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల వద్ద మంచుపర్వతం సెట్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడు చూపరులను ఆకట్టుకుంటుంది.



పెదజాలారిపేటలో భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న వెలగపూడి ప్రతాప్ రుద్ర, తదితరులు



కృష్ణా కాలేజీ రోడ్డులో పూజలందుకుంటున్న గణేశుడు

పలుచోట్ల అన్న సమారాధన

ఎంవీపీ కాలనీ: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలు మండపాల వద్ద అన్న సమారాధనలను చేపట్టారు. పెదజాలారిపేటలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీయువనేత వెలగపూడి ప్రతాప్ రుద్ర ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అలాగే ఎంవీపీ రైతు బజారులో రైతుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనకు వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.



ఎంవీపీ రైతు బజారులో భోజనాలు వడ్డిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, తదితరులు



శ్రీనివాస కల్యాణం నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ఘనంగా ఉత్తరాంధ్ర సాహితీ, సాంస్కృతిక వేడుకలు

తెలుగు భాష పరిరక్షణకు అందరూ కృషి చేయాలి: సీపీ శంఖబ్రత బాగ్చి

మద్దిలపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఆంధ్ర సారస్వత పరిషత్తు, విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన ఉత్తరాంధ్ర సాహితీ, సాంస్కృతిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రారంభమైన ఈ వేడుకల్లో ముందుగా మొదలైన కర్ణాటక సంగీత గాత్ర కచేరిలో పంతుల రమ శిష్యులు ఆలపించిన శాస్త్రీయ, భక్తి గానాలు అందరినీ అమితంగా ఆకట్టుకున్నాయి. ఆ తరువాత నిర్వహించిన అష్టావధానంలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ భాష బతికున్నంతవరకు అష్టావధానం విశ్వవీధుల్లో తెలుగు ఖ్యాతిని చాటుతూనే ఉంటుందన్నారు.

అనంతరం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన కవులు పాల్గొని తమ కవిత్వాలను వినిపించారు. పలువురు చిన్నారులు మన సంస్కృతీ సంప్రదాయాలను చాటిచెప్పేలా చేసిన శాస్త్రీయ కూచిపూడి నృత్యాలు అలరించాయి. గాజువాక కళారాధాన మ్యూజికల్ అండ్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం ఆద్యంతం రక్తికట్టించింది. భావం, రాగం, లయ, తాళం సమన్వయంతో కూచిపూడి శైలిలో భావభంగిమలు, హస్తముద్రలతో అద్భుతమైన ప్రదర్శనలకు ఆడిటోరియంలో చప్పట్లు మార్మోగాయి. చివరగా ప్రదర్శించిన 'తనదాకా వస్తే' నాటిక ఆహూతుల మన్ననలను అందుకుంది.

ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు ప్రతిఒక్కరకూ కృషి చేయాలన్నారు. తెలుగు భాషను కాపాడుకుంటూ తెలుగు భాష కీర్తి ప్రతిష్ఠలను విశ్వవ్యాపితమయ్యేలా భాషకు పట్టాభిషేకం చేయాలన్నారు. కార్యక్రమంలో సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, కళాభారతి నిర్వహకులు ఎం.ఎస్.ఎన్.రాజు, రాంబాబు, ఫైడా కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమ కార్యాచరణ

శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

మద్దిలపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంలో కూటమి ప్రభుత్వం తీరును వ్యతిరేకిస్తూ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఇతర పార్టీల నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో పాటు విశాఖలో రూ.వేల కోట్ల విలువ చేసే భూములను లూలు మాల్, ఇతర సంస్థలకు ధారదత్తం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమ కార్యచరణ రూపొందించామన్నారు. జీవీఎంసీలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న కార్పొరేటర్ల వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్లకు వినతిపత్రాలు అందించాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడానికి అన్ని విభాగాల కమిటీలను తక్షణమే నియమించాలని సూచించారు. ఈ సమావేశంలో వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఎమ్మెల్సీ రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, తైనాల విజయకుమార్, తిప్పల నాగిరెడ్డి, సమన్వయ కర్తలు మొల్లి అప్పారావు, దేవన్‌రెడ్డి, మాజీ మేయర్ హరివెంకటకుమారి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

బైబై గణేశా..

సాగరతీరంలో ఆదివారం సాయంత్రం నుంచి వినాయక విగ్రహాల నిమజ్జనాలను ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులు మధ్యాహ్నం ఆయా మండాపల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పురవీధుల్లో గణేశుని విగ్రహాలను ఊరేగించి తీరానికి తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా తీరానికి గణేశుని విగ్రహాన్ని తెచ్చిన నిర్వాహకులు



కోస్టల్ బ్యాటరీ వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

చదరంగం టోర్నీ చాంపియన్లుగా నగర క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర చదరంగం (చెస్) సంఘం నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చదరంగం చాంపియన్‌షిప్ టోర్నీని భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన విశాఖ క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. వాల్తేరు క్లబ్‌లో ఈ టోర్నీ రెండు రోజులు జరిగింది. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి సీఎంఆర్ గ్రూప్స్ అధినేత మావూరి వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు చూపిన ప్రతిభ అభినందనీయమన్నారు. క్రీడాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలుంటాయని పేర్కొన్నారు. ఆంధ్ర చెస్ సంఘం అధ్యక్షుడు ఎ.సురేష్ మాట్లాడుతూ త్వరలో ఉన్నత స్థాయి క్రీడాకారులు వెలుగు చూస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్ర చెస్ సంఘం వ్యవస్థాపకుడు కేవీవీ శర్మ మాట్లాడుతూ టోర్నీకి సహాయ సహకారాలందించిన వాల్తేరు క్లబ్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.మణికంఠరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విజేతలు: ర్యాపిడ్ ఈవెంట్‌లో డీఎస్ఎస్‌యు.సాత్విక్ (ఆంధ్ర), శ్రావ్యశ్రీ భీమరశెట్టి (ఆంధ్ర), గొర్లి నైనా (విశాఖ) తలో ఎనిమిది పాయింట్లతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు.

బ్లిట్జ్ ఈవెంట్‌లో ఆదిత్య వరుణ్ గంపా (విశాఖ), బైద్ అరోవ్ (విశాఖ), డీఎస్ఎస్‌యు.సాత్విక్ (ఆంధ్ర) తలో ఎనిమిది పాయింట్లతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు.



ర్యాపిడ్, చెస్-2 బ్లిట్జ్‌లో విజేతలతో ప్రముఖులు

ముగిసిన భారత మహిళా క్రికెటర్ల శిక్షణ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరుగుతున్న భారత మహిళల క్రికెట్ జట్టు శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఐసీసీ మహిళల వరల్డ్ కప్ క్రికెట్ టోర్నీకి భారత మహిళా క్రికెటర్లు అన్ని రంగాల్లో సన్నద్ధమవుతున్నారు. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక శిక్షణలో బ్యాటర్లు, బౌలర్ల ప్రతిభను మెరుగుపరిచే ప్రత్యేక శిక్షణ జరిగింది. నిర్ణీత ఓవర్లలో బ్యాటింగ్‌లో పరుగులు సాధించడం, బౌలింగ్‌లో వికెట్లు పడగొట్టే నైపుణ్యం ప్రత్యేక సెషన్‌లో మహిళా క్రికెటర్లు ప్రతిభను ప్రదర్శించారు. ఎనిమిది రోజులు ఇక్కడ జరిగిన సన్నాహక శిబిరంలో భారత జట్టు మహిళా క్రికెటర్లు హర్మన్‌ప్రీత్ కౌర్, రేణుక సింగ్ ఠాకూర్, రాధా యాదవ్, అరుంధతి రెడ్డి, రిచా ఘోష్, దీప్తి శర్మ, స్నేహ రానా, హర్లీన్, ప్రతిక రావల్, స్మృతి మందాన, జెమిమా పాల్గొన్నారు.



మైదానంలో సమాలోచనలు చేస్తున్న క్రికెటర్లు

రేపటి నుంచి ఏసీఏ మహిళల టీ-20 లీగ్

ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో మంగళవారం నుంచి ఏసీఏ మహిళల టీ-20 లీగ్ టోర్నీ జరగనుంది. సెప్టెంబరు 9 వరకు జరిగే ఈ టోర్నీలో నాలుగు జట్లు పాల్గొంటున్నాయి. రోజూ రెండు మ్యాచ్‌లు జరిగేలా నిర్వాహకులు షెడ్యూల్ రూపొందించారు.

కరాటే టోర్నీలో చిన్నారుల ప్రతిభ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాలుగో దక్షిణ భారత కరాటే చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన వాడోక్రై కరాటే డో క్రీడాకారులు పతకాలు సాధించారు. ఆదివారం బెంగళూరులో జరిగిన ఈ పోటీల్లో కటా ఈవెంట్‌లో పవిత గుప్తా, శ్రేయాన్స్ తముడియా, బి.సిరి, పి.భవష్య శ్రీ స్వర్ణ పతకాలు సొంతం చేసుకోగా, జె.షణ్ముఖ్, వేదాంతకుమార్, టి.హర్షవర్ధన్, నందు చౌదరి రజత పతకాలు, కె.హృతిక వర్మ కాంస్య పతకాలు సాధించారు. కుమిటి ఈవెంట్‌లో పి.భవ్యశ్రీ, వి.అర్విన్, సరబ తీర్థి కాంస్య పతకాలు దక్కించుకున్నారు. పతకాలు సాధించిన చిన్నారి క్రీడాకారులను రాష్ట్ర వాడోక్రై కరాటే డో సంఘం అధ్యక్షుడు చిగురుపల్లి సతీష్‌కుమార్ అభినందించారు.



ప్రశంసాపత్రాలు, పతకాలతో విజేతలు

బీసీ కాలనీలో అన్నదానం

ఆరిలోవ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 12వ వార్డులోని బి.సి. కాలనీలో వినాయక నవరాత్రుల సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కుమారుడు వెలగపూడి ప్రతాపరుద్ర పాల్గొన్నారు. స్వయంగా భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. సుమారు 2000 మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.



వడ్డిస్తున్న వెలగపూడి ప్రతాపరుద్ర

జూ పార్కుకు సందర్శకుల తాకిడి

ఆరిలోవ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధి జూలాజికల్ పార్కులో ఆదివారం సందర్శకుల తాకిడి పెరిగింది. 2,215మంది సందర్శించారు. వీరి ద్వారా సుమారు రూ.1.84 లక్షల ఆదాయం సమకూరినట్లు క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.

ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా?

ఆరిలోవ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శ్రీకాంత్‌నగర్ సమీపంలోని కనకమహాలక్ష్మి క్యాటరింగ్ నిర్వాహకులు విద్యుత్ స్తంభాన్ని మూసేసి మరీ రేకుల షెడ్డు వేశారు. ఇలా వేయడం వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు స్తంభంపైకి వెళ్లడం కూడా ఇబ్బందికరంగా ఉంటుంది. అనుకోకుండా విద్యుత్ రేకులకు ప్రసరిస్తే ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉంటుంది. ఇంత జరిగినా విద్యుత్ సిబ్బంది తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



శ్రీకాంత్‌నగర్ వద్ద స్తంభాన్ని ఆనుకుని వేసిన రేకుల షెడ్డు

రేపటి నుంచి దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి, ఛత్ పూజలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 06559 నంబరు గల రైలు సెప్టెంబరు 2 నుంచి నవంబరు 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 11.40 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 6.18 గంటలకు దువ్వాడ, శుక్రవారం ఉదయం 5 గంటలకు నారంగి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 06560 నంబరు గల రైలు సెప్టెంబరు 6 నుంచి నవంబరు 29 వరకు ప్రతి శనివారం ఉదయం 5.30 గంటలకు నారంగిలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 9.45 గంటలకు బెంగళూరు చేరుతుంది. 07046 నంబరు గల రైలు నవంబరు 29 వరకు ప్రతి శనివారం ఉదయం 8.40 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 9.13 గంటలకు దువ్వాడ, సోమవారం సాయంత్రం 4 గంటలకు నహర్లగున్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07047 నంబరు గల రైలు సెప్టెంబరు 2 నుంచి డిసెంబరు 2 వరకు ప్రతి మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు నహర్లగున్‌లో బయలుదేరి గురువారం ఉదయం 8.15 గంటలకు దువ్వాడ, రాత్రి 9.30 గంటలకు చర్లపల్లి చేరుతుంది. 03430 నంబరు గల రైలు నవంబరు 11 వరకు ప్రతి మంగళవారం సాయంత్రం 5.15 గంటలకు మాల్దా టౌన్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు దువ్వాడ, గురువారం ఉదయం 4 గంటలకు చర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 03429 నంబరు గల రైలు సెప్టెంబరు 2 నుంచి నవంబరు 13 వరకు ప్రతి గురువారం సాయంత్రం 4.50 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.50 గంటలకు దువ్వాడ, శనివారం ఉదయం 5 గంటలకు మాల్దా టౌన్ చేరుతుందని డీసీఎం సందీప్ పేర్కొన్నారు

వైద్య ఉద్యోగుల హక్కుల సాధనకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న గిరిబాబు

ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గిరిబాబు

పెదవాల్తేరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వైద్య ఉద్యోగుల హక్కుల సాధనకు పోరాడాలని నిర్ణయించినట్లు ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గిరిబాబు పేర్కొన్నారు. 36% తాత్కాలిక భృతి ప్రకటన, 12వ వేతన కమిటీ చైర్మన్ నియామకం, పెండింగ్ డీఏల చెల్లింపు డిమాండ్లు నెరవేర్చాలని ఆయన కోరారు. ఏఐటీయూసీ అనుబంధ, ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘం విశాఖపట్నం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం పెదవాల్తేరు టీబీ హాస్పిటల్ ఆవరణలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.అప్పారావు అధ్యక్షతన జరిగింది. ఇందులో గిరిబాబు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసి హక్కులు పొందిన విషయాన్ని గుర్తుచేశారు. ఇందులో చాలా సమస్యలు పరిష్కారం కావడంలేదని పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ఏపీసీవోఎస్ కొనసాగించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయి సత్యనారాయణ మాట్లాడుతూ సంపాదిత సెలవులకు నగదు చెల్లింపు, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌లో పదోన్నతులు, వైద్య విద్యాసంచాలకుల విభాగంలో ఇన్ సర్వీస్ శిక్షణ పూర్తి చేసిన ల్యాబ్ అటెండెంట్, ల్యాబ్ టెక్నీషియన్‌లకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ల్యాబ్ సూపర్‌వైజర్, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 1 పోస్టులు, చీఫ్ రేడియోగ్రాఫర్ పోస్టులు మంజూరు చేసి పదోన్నతులు కల్పించాలని కోరారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు బదిలీ సౌకర్యం కల్పించాలని కోరారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 35 రోజుల సాధారణ సెలవులు, ఫార్మసీ విభాగంలో పని చేసేవారికి ఆరోగ్యశ్రీ స్టాఫ్ ఇన్సెంటివ్ చెల్లింపు, ఈసీజీ టెక్నీషియన్ పోస్టుల భర్తీ, డేటా నమోదు కోసం డీఈవోల నియామకం, ఎంఎన్‌ఓలకు అదనపు హెచ్‌ఆర్‌ఏ, అర్హులకు హాస్పిటల్ అడ్మిన్ పదోన్నతులు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు 100% బేసిక్, డీఏ, హెచ్‌ఆర్‌ఏ చెల్లింపు, 126 జీవోని సవరించి ఈఎస్ఐ ఉద్యోగులకు పదోన్నతులు, జీవో 190 సవరించి మెడికల్ సబార్డినేట్ సర్వీస్ ఉద్యోగులకు ఎమ్మెన్ డబ్ల్యూ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పడాల రమణతో డైమండ్ జూబ్లీ ఉత్సవాలలోగోను ఆవిష్కరింపజేశారు. సారిపిల్లి గంగరాజు, కొర్రయి రమేష్, ఎస్కే ఇబ్రహీం, ధనంజయ్, శివశంకర్, రమాశంకర్, మహ్మద్ దురాని, ఎంఎస్ రఘునాథరావు పాల్గొన్నారు.

కారు ఢీకొని ద్విచక్ర వాహనచోదకుడికి తీవ్రగాయాలు

ఆరిలోవ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): హనుమంతవాక జంక్షన్ నుంచి అడవివరం వైపు ఆదివారం అతివేగంగా వెళ్తున్న ఓ కారు దారపాలెం సమీపంలో ద్విచక్ర వాహన చోదకుని ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహన చోదకుడి కాలికి గాయమైంది. వెంటనే స్థానికులు 108కి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వారు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడి వివరాలు తెలియలేదు. వాహనం కూడా పాడైనట్లు స్థానికులు చెప్పారు. ఈ ప్రమాద విషయంలో తమకు ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఆరిలోవ సీఐ మల్లేశ్వర రావు తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

మహారాణిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సెప్టెంబరు 2న విశాఖ రానున్న సందర్భంగా జిల్లా అధికారులు ఆదివారం సాయంత్రం ఏర్పాట్లను సమీక్షించారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లు నేవల్ కోస్టల్ బ్యాటరీ వద్ద గల హెలిపాడ్‌లను, అక్కడ చేపట్టవలసిన పనులను పరిశీలించారు. మంగళవారం జరగబోయే ఈస్టు కోస్టు మారిటైం అండ్ లాజిస్టిక్ సమ్మిట్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానున్నందున అక్కడ ఏర్పాట్లపై కూడా చర్చించారు. ముఖ్యమంత్రి గ్రీన్ రూమ్, వీఐపీల సిటింగ్, ప్రొటోకాల్ తదితర అంశాలపై ఉన్నతాధికారులు సమీక్షించారు.

ఐటీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఐటీ కార్యాలయంలో ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా ఇంద్రజిత్ అన్నె, కార్యదర్శిగా శ్రీధర్ సరగడం, కోశాధికారిగా అనుపమ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దాసరి కిశోర్ ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని ఐటీ, ఐటీ ఆధారిత సేవలందించే ప్రముఖ సంస్థల ప్రతినిధులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఎన్నికకు ముందు పూర్వపు అధ్యక్షురాలు ముక్కవల్లి లక్ష్మి గత ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. అనంతరం సంబంధిత నివేదికను నూతన కార్యవర్గానికి అందజేశారు.

'లోకేశ్‌కు సమస్యలు వివరించా'

మురళీనగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేశ్‌ను కలిసి స్థానిక సమస్యలు వివరించినట్లు టీడీపీ నేత ఎస్.వరప్రసాద్ తెలిపారు. ఉత్తర నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని, 17 వార్డుల్లో తన దృష్టికి వచ్చిన అంశాలను వివరించానన్నారు. 22ఎ జాబితాలో ఉండిపోయిన భూముల కారణంగా యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు పరిష్కరించాలని కోరానన్నారు.

భవనం పైనుంచి జారి పడి కార్మికురాలి మృతి


సత్యాలు

సాగర్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పెద్ద రుషికొండ ఐటీ హబ్‌లో ఉన్న ఆదిత్య అపార్టుమెంట్ వెనుక ప్రాంతంలో నిర్మాణంలో వున్న బహుళ అంతస్తు భవనం పైనుంచి ప్రమాదవశాత్తు జారి పడి భవన నిర్మాణ కార్మికురాలు మృతి చెందింది. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆరిలోవలోని తోటగరువు ప్రాంతానికి చెందిన చందక సింహాచలం, సత్యాలు (48) కొద్ది రోజులుగా ఆదిత్య అపార్టుమెంట్ వెనుక నిర్మాణంలో వున్న బహుళ అంతస్తు భవనంలో పని చేస్తున్నారు. ఆదివారం రెండో అంతస్తులో పనికి వెళ్లిన సత్యాలు కళ్లు తిరిగి అక్కడి నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందింది. భవనం యజమాని సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఇతర ఉద్యోగులు

ఐక్యతకు క్రీడలు దోహదం: డీఆర్ఎం బొహ్రా

» వాల్తేరు రైల్వేలో ఫిట్ ఇండియా, జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహించిన మూడు రోజుల ఫిట్ ఇండియా, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఇతర అధికారులు, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని 'శాంతియుత సమాజాన్ని ప్రోత్సహించేదే క్రీడ' అనే నినాదంతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ ఐక్యత నెలకొల్పడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం నేపథ్యంలో మూడు రోజులుగా డివిజన్ వ్యాప్తంగా ఫిట్ ఇండియా కార్యక్రమాలు నిర్వహించామని, రోజుకు కనీసం గంటపాటు శారీరక వ్యాయామం చేయడం ద్వారా క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు శారీరక పరిపుష్టి పొందడంపై అవగాహన కల్పించామన్నారు. క్రీడాస్ఫూర్తిని పాటించడం, క్రీడలను ప్రోత్సహించడంలో వాల్తేరు రైల్వే అంకితభావంతో నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రాణించిన రైల్వే క్రీడాకారులతోపాటు క్రీడల్లో రాణిస్తున్న ఉద్యోగుల పిల్లలను వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల మధ్య బంధాలను బలోపేతం చేయడంలో క్రీడల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, నిరంతర సాధనతో క్రీడల్లో రాణిస్తున్నవారికి ఉన్నత భవిష్యత్తు ఉంటుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, స్పోర్ట్సు ఆఫీసర్ హరినాథ్, ఇతర అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, ఇతర నాయకులు

ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమం

సీతమ్మధార, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం చేపట్టిన మన్ కీ బాత్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఉత్తర నియోజకవర్గం 181వ బూత్ 14వ వార్డు సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమం ఏర్పాట్లను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, ఇతర నాయకులు పాల్గొని మన్ కీ బాత్‌లో ప్రధాని ప్రసంగాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

క్యారమ్స్‌లో విశాఖ క్రీడాకారుల సత్తా



పురుషుల విభాగంలో సీహెచ్ జనార్దనరెడ్డి, మహిళల విభాగంలో ఎ.భవానీలు ప్రథమ బహుమతులు అందుకుంటున్న దృశ్యం

చిలకలూరిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఆర్ క్లబ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీల్లో విశాఖ క్రీడాకారులు సత్తా చాటారు. పురుషుల, మహిళల విభాగాల్లో విశాఖపట్టణానికే చెందిన సీహెచ్. జనార్దన్‌రెడ్డి, ఎ.భవాని ప్రథమ బహుమతులు అందుకున్నారు. రాష్ట్ర క్యారమ్ సంఘం ప్రధానకార్యదర్శి షేక్ అబ్దుక్ జలీల్, టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌వీరమణమూర్తి, అబ్జర్వర్ గద్దె వేణు పాల్గొన్నారు. జనార్దన్ రెడ్డికి క్యారమ్ మాల్దీవుల్లో జరిగే ప్రపంచ కప్ పోటీలకు వెళ్లేందుకు గాను సీఆర్ క్లబ్ తరపున కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు.

మత్తు ప్రేమికుల మధ్యలో 'మద్దీ'

» ఎండీఎంఏ కేసులో ప్రధాన సూత్రధారి

వైజాగ్ ప్రేమికులు దొరకడంతో పరారీ

(విజయవాడ, ఆంధ్రజ్యోతి)

వైజాగ్ ప్రేమికులకు ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను సమకూర్చిన మల్లెల మధుసూదన్‌రెడ్డి అలియాస్ మద్దీ ఎవరు? డ్రగ్స్ పురమాయించిన లోహిత్ యాదవ్‌కు, మద్దీకి పరిచయం ఎలా ఏర్పడింది? వైజాగ్ తీరానికి మాదకద్రవ్యాలు బెంగళూరు నుంచే వెళ్తున్నాయా? అంటే దర్యాప్తు బృందాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను బెంగళూరు నుంచి ట్రావెల్స్ బస్సులో వైజాగ్ తీసుకెళ్తుండగా, అర్వాల శ్రీవాత్సవ్, బొడ్డేపల్లి హవీల డిలైట్ అనే ప్రేమికులను ఈగల్ పోలీసులు విజయవాడలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారిద్దరికీ కోర్టు రిమాండ్ విధించింది. శ్రీవా త్సవ్‌తో ఎండీఎంఏ డ్రగ్‌ను రప్పిస్తున్న వైజాగ్‌కు చెందిన లోహిత్ యాదవ్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. మద్దీ సొంతూరు నెల్లూరు. డిగ్రీ చదివాడు. ఉపాధి కోసం బెంగళూరువెళ్లి ఎండీఎంఏను యువతకు సరఫరా చేయడం మొదలుపెట్టాడు. శ్రీవాత్సవ్, హవీల నుంచి ఫోన్‌పే ద్వారా డబ్బు అందుకుని ఎండీఎంఏను సమకూర్చాడు. బెంగళూరు మెట్రో రైల్వే స్టేషన్లకు సమీపంలో ఖాళీ ప్రదేశాలను, దుకాణాలను డ్రాపింగ్ పాయింట్లుగా చేసుకున్నాడు. డబ్బు ఖాతాలో జమకాగానే, డ్రాపింగ్ పాయింట్ ఫొటో, లొకేషన్‌ను వాట్సాప్‌లో పంపుతాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఖాళీ సిగరెట్ ప్యాకెట్లలో డ్రగ్‌ను అమర్చుతాడు. శ్రీవాత్సవ్, హవీల విజయవాడలో పోలీసులకు దొరికి పోయారని తెలియడంతో మద్దీ పరారయ్యాడు. వైజాగ్‌లో ఉన్న లోహిత్ యాదవ్‌కు మద్దీ ఎలా పరిచయమయ్యాడు, ఎంతమంది అతడితో సంప్రదింపులు చేశారనే దానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు.

డ్రగ్స్ తీసుకుంటూ వీడియోలు, ఫొటోలు

శ్రీవాత్సవ్, హవీల ప్రేమికులు. వీరి ఫోన్లను సీజ్ చేసిన పోలీసులు సాంకేతికంగా విశ్లేషిస్తున్నారు. శ్రీవాత్సవ్ ఫోన్ గ్యాలరీలో హవీలతో కలిసి డ్రగ్స్ తీసుకుంటున్న వీడియోలు, ఫొటోలనే సాక్ష్యాలుగా పోలీసులు కోర్టుకు అందజేయనున్నారు.

'ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలి'



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

అక్కయ్యపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని ఏపీ ఆటో డ్రైవర్లు, వర్కర్ల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్కయ్యపాలెం నాలుగులేన్ల రహదారి వద్ద ఆటో డ్రైవర్లు ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు పథకంతో ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం కల్పించాలన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం డీజిల్, పెట్రోల్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్డు ట్యాక్స్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువులు, వాహన విడి భాగాలు, టోల్ పంజా ధరలు భారీగా పెంచి డ్రైవర్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికృష్ణ, కేలం శివ, నూకరాజు పాల్గొన్నారు.

'ఢిల్లీరావు కార్మిక పక్షపాతి'


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కార్మికవర్గం సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతగా పనిచేసిన నేత ఢిల్లీరావు అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కొనియాడారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఢిల్లీరావు సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి సీనియర్ నాయకులు పి.వెంకటరెడ్డి, ఎం.రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ కార్మిక రాజ్యం రావాలన్న కాంక్షతో దోపిడీ రహిత సమాజం కోసం ఆయన పనిచేశారన్నారు. సీపీఎం జిల్లా నాయకులు బి.పద్మ, బొట్టా ఈశ్వరమ్మ, వెంకటరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

క్వాంటం కంప్యూటింగ్ టూల్స్‌పై అవగాహన అవసరం


సదస్సులో మాట్లాడుతున్న క్వాంటం కంప్యూటింగ్ నిపుణుడు డాక్టర్ భాను ప్రకాశ్, వేదికపై ఇతర ప్రముఖులు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : క్వాంటం కంప్యూటింగ్‌లో టూల్స్ వినియోగం అత్యంత కీలకమని కేఎల్ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్, క్వాంటం కంప్యూటింగ్ నిపుణుడు డాక్టర్ కె. భానుప్రకాశ్ అన్నారు. ఏయూలోని కంప్యూటర్ సైన్స్ అల్గారిదమ్ సెమినార్ హాల్‌లో మూడు రోజులుగా క్వాంటం కంప్యూ టింగ్ ఇన్ సైట్స్ ఫర్ అకడమీషన్స్ ప్రోగ్రామ్ పేరుతో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో భానుప్రకాశ్ మాట్లాడుతూ క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన సెక్యూ రిటీ ప్రొవైడింగ్ సిస్టమ్స్ గురించి వివరించారు. భవిష్యత్‌లో గొప్ప అవకాశాలను క్వాంటం కంప్యూటింగ్ నిపు ణులు దక్కించుకుంటారన్నారు. కోల్‌కతాలోని టీసీఎస్ కంపెనీ టెక్నికల్ లీడ్ అండ్ క్వాంటం రీసెర్చర్ రాహుల్ రాణా మాట్లాడుతూ క్వాంటం ఆప్టమైజేషన్‌కు సంబంధించిన టెక్నిక్స్‌ను వివరించారు. ఏయూ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె. వెంకటరావు మాట్లాడుతూ క్వాంటం కంప్యూటింగ్ అంటే ఏమిటి, సూపర్ పొజిషన్, ఎంటాంగిల్‌మెంట్, దాని ఉపయోగాలు వంటి అంశాలను తెలిపారు. దేశంలో క్వాంటం కంప్యూటింగ్ కోర్సును ప్రారంభించిన వర్సిటీగా ఏయూ గుర్తింపు సాధించినట్టు చెప్పారు. ఏపీ ప్రభుత్వం, నేషనల్ క్వాంటం మెషిన్‌లో భాగంగా క్వాంటం టెక్నాలజీని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ క్రమంలోనే అమరావతిలో క్వాంటం కంవ్యాలీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఓఫూ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ కో-ఫౌండర్ అండ్ ఎండీ ఎన్. భానుమూర్తి, సదస్సు కో-కన్వీనర్లు డాక్టర్ కె. రాజ్‌కుమార్, డాక్టర్ కేవీ రమణ, ప్రొఫె సర్ శశి, ప్రొఫెసర్ వల్లీ కుమారి, ప్రొఫెసర్ లలితా భాస్కరి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన సమయం..పారాహుషార్

» పోలీసు సిబ్బంది, స్విమ్మర్లను అప్రమత్తం చేసిన సీఐ


సిబ్బందికి సూచనలు చేస్తున్న వన్‌టౌన్ సీఐ జి.దేముడుబాబు

మహారాణిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనం సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పోలీసు సిబ్బందికి వన్‌టౌన్ సీఐ జి.దేముడు బాబు ఆదివారం అవగాహన కల్పించారు నేవల్ కోస్టల్ బ్యాటరీ వద్ద గణేశ్ నిమజ్జనాలు పెద్దఎత్తున జరగనున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగరూకతతో ఉండాలో అదే స్థలం వద్ద సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. ఎవరూ సముద్రం లోపలకు వెళ్లకుండా గమనించాలని, పొరపాటున వెళ్లినా వారి ప్రాణాలు పోగొట్టుకోకుండా స్విమ్మర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు ఆదివారం జరిగిన నిమజ్జన కార్యక్రమంలో భీమిలి తదితర ప్రాంతాల్లో లైఫ్ గార్డులు కొందరి ప్రాణాలు కాపాడిన నేపథ్యంలో అప్రమత్తం చేశారు. సమావేశంలో మెరైన్ పోలీసులు కూడా పాల్గొన్నారు.

రౌడీషీటర్ ఖాజాపై ఇనుప రాడ్డు, కర్రలతో దాడి

» కేజీహెచ్‌లో చికిత్స..అదుపులో నిందితులు

సీతంపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి రైల్వే క్వార్టర్స్‌లో పేకాడుతున్న కొంత మంది మధ్య గొడవలు జరిగాయి. అందులో ఒకరైన రౌడీ షీటర్ ఖాజాపై కొంత మంది ఇనుప రాడ్లు, కర్రలతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన అతడిని కొంత దూరం వాహనంపై తీసుకువెళ్లి పడవేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రైల్వే న్యూకాలనీ క్వార్టర్స్‌లో సాయిబాబా ఆలయం సమీపంలో రౌడీ షీటర్ ఖాజా, బెనర్జీ, బాబ్జి, బంగారం షాపు శ్రీను, మరో నలుగురు శనివారం రాత్రి పేకాడుతున్నారు. ఆ సమయంలో వారి మధ్య గొడవలు జరిగాయి. దీంతో రౌడీషీటర్ ఖాజాను అక్కడే పేకాడుతున్న మరో రౌడీషీటర్ ఈశ్వరరావు ఎలియాస్ దిండు, మరి కొంత మంది కలిసి ఇనుప రాడ్లు, కర్రలతో తలపై గట్టిగా కొట్టారు. అంతటితో ఆగకుండా గాయాలపాలైన ఖాజాను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని అల్లిపురంలోని డీఆర్ఎం కార్యాలయం వద్ద పడవేశారు. అతని వద్ద నుంచి రూ.22 వేల నగదును పట్టుకుపోయారు. అయితే ఖాజాను ఆటోలో అబ్దుల్లా అనే వ్యక్తి చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. సంఘటన జరిగిన వివరాలను తెలుసుకున్న నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ ఉమాకాంత్ తన సిబ్బందితో వెళ్లి దర్యాప్తు చేపట్టారు. దాడి జరిగిన సమయంలో అక్కడున్న బెనర్జీ శివ, సాగర్ అనే ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ దాడి సంఘటనపై నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి దృష్టి సారించి రౌడీషీటర్ల ఆగడాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడిలో పాల్గొన్న వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, తక్షణమే వారిని అదుపులోకి తీసుకోవాలని స్టేషన్ అధికారులను ఆదేశించారు.

నాట్యగణపతిగా దర్శనం


అక్కయ్యపాలెంలోని ఆంధ్రజ్యోతి కార్యాలయం సమీపంలోని లక్ష్మీగణపతి ఆలయంలో వినాయకుడ్ని ఆదివారం నాట్య గణపతిగా అలంకరించిన దృశ్యం -ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



మహారాణిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : గోకుల్ బీచ్ రోడ్డు వద్ద బార్ వెనుక భాగంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో వింటేజ్ బార్ వెనుక మృతదేహం ఉన్నట్టు స్థానికులు గుర్తించి, మహారాణిపేట పోలీసులకు సమాచారం అందిం చారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతుడు భీమునిపట్నంకు చెం దిన ఎల్లాజీ (30)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీ హెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలు

మహారాణిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై బైక్ బోల్తా పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఓల్డ్ ఐటీఐ ప్రాంతానికి చెందిన రాజేష్ (25), ఉదయ్ (27) ఆదివారం సాయంత్రం బైక్‌పై ఆర్‌కే బీచ్‌కు వెళ్లారు. రాత్రి అక్కడి నుంచి సంపత్‌వినాయక టెంపుల్ మీదుగా తిరిగి వస్తుండగా ఫ్లైఓవర్‌పై బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెం టనే స్థానికులు వారిని కేజీహెచ్‌కు తరలించారు.

ఆర్టీసీ సిబ్బందికి అవస్థలు

... 3వ పేజీ తరువాయి

ఉండిపోతే, వారిస్థానంలో మరో డ్రైవర్, కండక్టర్ డ్యూటీ ఎక్కి బస్సుని తిరిగి విజయవాడ, అమలాపురం, రాజోలు, తాడేపల్లిగూడెం, తెనాలి వంటి దూర ప్రాంతాలకు వెళతారు. అక్కడి నుంచి వచ్చిన డ్రైవర్లు, కండక్టర్లు విశ్రాంతిభవనంలో నిద్రపోయి మరుసటిరోజు ఉదయం తిరిగి డ్యూటీ ఎక్కుతారు. అయితే విశ్రాంతి భవనంలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ భవనంలో 13 మంచాలు ఫ్యాన్‌లను ఏర్పాటుచేశారు. ఒకటి, రెండు మినహా మిగిలిన ఫ్యాన్‌లు తిరగడం లేదు. దీంతో తీవ్ర ఉక్కపోతతో సిబ్బంది సతమతమవుతున్నారు. మరోవైపు విశ్రాంతిభవనం పైకప్పు సిమెంట్ రేకులతో నిర్మించడంతో చిన్నపాటి ఎండకాస్తే ఉక్కపోత, వేడిపెరిగిపోతోందని వాపోతున్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదుచేసినా కనీసం స్పందనలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుదూరప్రాంతాల నుంచి బస్సులో విధులు నిర్వర్తించి, విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో కనీసం కూర్చోవడానికి కూడా అవకాశం లేని దుర్భర పరిసితులు నెలకొనడంతో, మరుసటిరోజు విధి నిర్వహణ సవాల్‌గా మారుతోందని వాపోతున్నారు. అధికారులు సిబ్బంది సంక్షేమంతోపాటు ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని విశ్రాంతి భవనంలో సమస్యలను పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు.

పెద్దాస్పత్రి దశ తిరిగేనా?

... 3వ పేజీ తరువాయి

సదుపాయాలు లేవు. కొన్నిచోట్ల చోరీలు జరుగుతున్నాయి. వర్షం వస్తే ఉండలేని పరిస్థితులున్నాయి.

వైద్యులపై దృష్టి సారించాలి..

కొన్నాళ్లుగా కీలకకేసుల్లో ఆస్పత్రి వైద్యుల పాత్ర బహి ర్గతమవుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి వైద్యులకు హెచ్చ రికలు జారీచేయాల్సి ఉంది. కీలకస్థానాల్లోని అధికారులు, విభాగాధిపతులు ప్రైవేటు సేవల్లో తరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆస్పత్రి పనివేళల్లో కొందరు వైద్యులు ప్రైవేటు కు ప్రాధాన్యతనిస్తుండడంతో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదనే విమర్శలున్నాయి. వీటిపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించాలి.

భవనాలపై దృష్టి సారించేనా.?

గత ప్రభుత్వ హయాంలో ఆస్పత్రిలోని కొన్ని విభాగాల భవనాలను కూల్చివేశారు. నూతన భవనాలకు ప్రతిపాదనలు చేసి నాడు-నేడులో భాగంగా పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. నిధులు మంజూరు చేయకపోవడం, ఇతర కారణాలతో పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో నూతన భవన నిర్మాణాలు చేపట్టేలా మంత్రి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేషన్ డిపోలకు స్మార్ట్ రైస్ కార్డులు

... 3వ పేజీ తరువాయి

అధికారులు ఆదేశించారు. దీనిపై కార్డుదారులు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు. ఎండీయూ వాహనాలు వచ్చిన తరువాత నాలుగేళ్ల నుంచి డీలర్లకు, కార్డుదారుల మధ్య సంబంధాలు చాలా వరకు నిలిచిపోయాయి. ఎండీయూలు వచ్చిన తరువాత నగరంలో చాలా వరకు డిపోలు వేర్వేరు చోట్లకు తరలించారు. మూడు నెలల క్రితం ఎండీయూలు రద్దుచేసిన తరువాత తిరిగి సరకుల పంపిణీ బాధ్యత డిపోలకు అప్పగించారు. ఈ కాలంలో కార్డుదారులను మ్యాపింగ్‌చేసిన డిపోలకు కాకుండా తమకు అందుబాటులో ఉన్న డిపోల నుంచి సరకులు తీసుకుంటున్నారు. మ్యాపింగ్ అయిన కార్డుదారుల కోసం కొందరు డీలర్లు అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్మార్ట్ కార్డుల పంపిణీ రేషన్ సవాల్‌గా మారుతుందని డీలర్లు చెబుతున్నారు. శనివారం ఆరిలోవలో ఒక డిపో వద్ద కార్డుల పంపిణీ కోసం వేచి వున్న పలువురి కార్డులు డిపోలో లేవని తేలడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

వృద్ధుడి అదృశ్యం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలేనికి చెందిన మాదాబత్తుల అప్పలరాజు (65) అనే వ్యక్తి కనిపించడం లేదంటూ ఎంవీపీ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. నక్కవానిపాలెంలో మాదాబత్తుల అప్పారావు కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆయన తండ్రి అప్పలరాజు మానసిక వైద్య చికిత్స పొందుతున్నారు. ఆగస్టు 28వ తేదీ రాత్రి ఏడు గంటల సమయంలో అప్పలరాజు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, కుటుంబ సభ్యుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. హెచ్‌సీ రమా శంకర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో ప్రగతిశీల శిక్షణ

వెంకోజీపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో వైద్యుల నైపుణ్యాలను పెంపొందించేందుకు గాను మెడికవర్ ఆస్పత్రి, ఒలింపస్ మెడికల్ సిస్టమ్ సంయుక్తంగా ఒకరోజు ప్రగతిశీల శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ఇక్కడి మెడికవర్ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్ (ఈబీయూఎస్)పై దృష్టి సారించి దేశవ్యాప్తంగా పల్మనాలజీ నిపుణులకు అత్యాధునిక శిక్షణను అందించడమే తమ లక్ష్యమన్నారు. ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల నివారణ, చికిత్సలో కీలకమైన ఈబీయూఎస్ టెక్నాలజీపై వైద్యులకు సుదీర్ఘమైన సిద్ధాంత, ప్రయోగిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నామన్నారు. ప్రముఖ పల్మనాలజిస్టులు డాక్టర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ సుధీర్‌తాలే మాట్లాడుతూ ఆధునిక వైద్య శిక్షణను భారతదేశానికి తీసుకురావడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

డీఎస్సీ నియామకాల్లో అవకతవకలను సరిదిద్దాలి

మద్దిలపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-25 పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో క్షేత్ర స్థాయిలో జరుగుతున్న అవకతవకలను వెంటనే సరిదిద్దాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పదేళ్ల తర్వాత విడుదలైన 16,347 ఉపాధ్యాయ పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 5.77 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆయా పోస్టుల భర్తీలో నిర్లక్ష్యం, అవకతవకలు చోటుచేసుకోవడంతో అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారన్నారు.

మెరుగైన సేవలందించాలి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపరచాలని ఉక్కు కార్మిక సంఘ నాయకులు కోరుతున్నారు. ఇటీవల కాలంలో చాలా మంది ఉద్యోగులు వీఆర్ఎస్, పదవీ విరమణ చేయడంతో చాలా వరకు వైద్య సేవలు తగ్గిపోయాయన్నారు. వైద్యులను నియమించి, పూర్తి స్థాయిలో సేవలందించాలని పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 38, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 36, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 50, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 86, కీరదోస 30, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	113
లైవ్ ధర	133
విత్ స్కిన్	236
స్కిన్‌లెస్	246

గణనాథులకు ప్రత్యేక పూజలు

పలు మండపాల వద్ద హోమాలు, అన్న సమారాధనలు

వెంకోజీపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పలుచోట్ల ప్రతిష్ఠించిన గణనాథులకు, ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరిపారు. ఇందులో భాగంగా కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా గణపతి హోమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సంఘం ప్రతినిధులు ఆడారి సత్యనారాయణ, పీలా ప్రేమ్‌కిరణ్


పెదజాలారిపేటలో భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న వెలగపూడి ప్రతాప్ రుద్ర, తదితరులు


కృష్ణా కాలేజీ రోడ్డులో పూజలందుకుంటున్న గణేశుడు

జగదీశ్, గ్రామస్థులు మద్దాల వీరవెంకట అప్పారావు, ధన రెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పాత వెంకోజీపాలెంలో శ్రీసీతారామ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం భజన కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీసీతారామ సేవా సంఘం ప్రతినిధులు మళ్ల పోలిరాజు, కర్రి వెంకట సూరిఅప్పారావు, మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవి కుమార్, జనసేన నాయకుడ పీల వెంకట పరదేశినాయుడు, తదితరులు పాల్గొన్నారు. కాగా కృష్ణా కళాశాల మార్గంలోని ఎలియన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల వద్ద మంచుపర్వతం సెట్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడు చూపరులను ఆకట్టుకుంటుంది.

పలుచోట్ల అన్న సమారాధన

ఎంవీపీ కాలనీ: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలు మండపాల వద్ద అన్న సమారాధనలను చేపట్టారు. పెదజాలారిపేటలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీయువనేత వెలగపూడి ప్రతాప్ రుద్ర ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అలాగే ఎంవీపీ రైతు బజారులో రైతుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనకు వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.


ఎంవీపీ రైతు బజారులో భోజనాలు వడ్డిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, తదితరులు


శ్రీనివాస కల్యాణం నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ఘనంగా ఉత్తరాంధ్ర సాహితీ, సాంస్కృతిక వేడుకలు

తెలుగు భాష పరిరక్షణకు అందరూ కృషి చేయాలి: సీపీ శంఖబ్రత బాగ్చి

మద్దిలపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఆంధ్ర సారస్వత పరిషత్తు, విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన ఉత్తరాంధ్ర సాహితీ, సాంస్కృతిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రారంభమైన ఈ వేడుకల్లో ముందుగా మొదలైన కర్ణాటక సంగీత గాత్ర కచేరిలో పంతుల రమ శిష్యులు ఆలపించిన శాస్త్రీయ, భక్తి గానాలు అందరినీ అమితంగా ఆకట్టుకున్నాయి. ఆ తరువాత నిర్వహించిన అష్టావధానంలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ భాష బతికున్నంతవరకు అష్టావధానం విశ్వవీధుల్లో తెలుగు ఖ్యాతిని చాటుతూనే ఉంటుందన్నారు.

అనంతరం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన కవులు పాల్గొని తమ కవిత్వాలను వినిపించారు. పలువురు చిన్నారులు మన సంస్కృతీ సంప్రదాయాలను చాటిచెప్పేలా చేసిన శాస్త్రీయ కూచిపూడి నృత్యాలు అలరించాయి. గాజువాక కళారాధాన మ్యూజికల్ అండ్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం ఆద్యంతం రక్తికట్టించింది. భావం, రాగం, లయ, తాళం సమన్వయంతో కూచిపూడి శైలిలో భావభంగిమలు, హస్తముద్రలతో అద్భుతమైన ప్రదర్శనలకు ఆడిటోరియంలో చప్పట్లు మార్మోగాయి. చివరగా ప్రదర్శించిన 'తనదాకా వస్తే' నాటిక ఆహుతుల మన్ననలను అందుకుంది.

ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు ప్రతిఒక్కరకూ కృషి చేయాలన్నారు. తెలుగు భాషను కాపాడుకుంటూ తెలుగు భాష కీర్తి ప్రతిష్ఠలను విశ్వవ్యాపితమయ్యేలా భాషకు పట్టాభిషేకం చేయాలన్నారు. కార్యక్రమంలో సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, కళాభారతి నిర్వహకులు ఎం.ఎస్.ఎన్.రాజు, రాంబాబు, పైడా కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమ కార్యాచరణ

శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

మద్దిలపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంలో కూటమి ప్రభుత్వం తీరును వ్యతిరేకిస్తూ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఇతర పార్టీల నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో పాటు విశాఖలో రూ.వేల కోట్ల విలువ చేసే భూములను లూలు మాల్, ఇతర సంస్థలకు ధారదత్తం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమ కార్యచరణ రూపొందించామన్నారు. జీవీఎంసీలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కార్పొరేటర్ల వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్లకు వినతిపత్రాలు అందించాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడానికి అన్ని విభాగాల కమిటీలను తక్షణమే నియమించాలని సూచించారు. ఈ సమావేశంలో వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఎమ్మెల్సీ రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, తైనాల విజయకుమార్, తిప్పల నాగిరెడ్డి, సమన్వయ కర్తలు మొల్లి అప్పారావు, దేవన్‌రెడ్డి, మాజీ మేయర్ హరివెంకటకుమారి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

బైబై గణేశా..


ఊరేగింపుగా తీరానికి గణేశుని విగ్రహాన్ని తెచ్చిన నిర్వాహకులు

సాగరతీరంలో ఆదివారం సాయంత్రం నుంచి వినాయక విగ్రహాల నిమజ్జనాలను ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులు మధ్యాహ్నం ఆయా మండాపల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పురవీధుల్లో గణేశుని విగ్రహాలను ఊరేగించి తీరానికి తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


కోస్టల్ బ్యాటరీ వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

చదరంగం టోర్నీ చాంపియన్లుగా నగర క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర చదరంగం (చెస్) సంఘం నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చదరంగం చాంపియన్‌షిప్ టోర్నీని భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన విశాఖ క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. వాల్తేరు క్లబ్‌లో ఈ టోర్నీ రెండు రోజులు జరిగింది. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి సీఎంఆర్ గ్రూప్స్ అధినేత మావూరి వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు చూపిన ప్రతిభ అభినందనీయమన్నారు.


ర్యాపిడ్, చెస్-2 బ్లిట్జ్‌లో విజేతలతో ప్రముఖులు

క్రీడాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలుంటాయని పేర్కొన్నారు. ఆంధ్ర చెస్ సంఘం అధ్యక్షుడు ఎ.సురేష్ మాట్లాడుతూ త్వరలో ఉన్నత స్థాయి క్రీడాకారులు వెలుగు చూస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్ర చెస్ సంఘం వ్యవస్థాపకుడు కేవీవీ శర్మ మాట్లాడుతూ టోర్నీకి సహాయ సహకారాలందించిన వాల్తేరు క్లబ్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.మణికంఠరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విజేతలు: ర్యాపిడ్ ఈవెంట్‌లో డీఎస్‌ఎస్‌యు.సాత్విక్ (ఆంధ్ర), శ్రావ్యశ్రీ భీమరశెట్టి (ఆంధ్ర), గొర్లి నైనా (విశాఖ) తలో ఎనిమిది పాయింట్లతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు.

బ్లిట్జ్ ఈవెంట్‌లో ఆదిత్య వరుణ్ గంపా (విశాఖ), బైద్ అరోవ్ (విశాఖ), డీఎస్ఎస్‌యు.సాత్విక్ (ఆంధ్ర) తలో ఎనిమిది పాయింట్లతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు.

కరాటే టోర్నీలో చిన్నారుల ప్రతిభ


ప్రశంసాపత్రాలు, పతకాలతో విజేతలు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాలుగో దక్షిణ భారత కరాటే చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన వాడోక్కై కరాటే డో క్రీడాకారులు పతకాలు సాధించారు. ఆదివారం బెంగళూరులో జరిగిన ఈ పోటీల్లో కటా ఈవెంట్‌లో పవిత గుప్తా, శ్రేయాన్స్ తముడియా, బి.సిరి, పి.భవ్య శ్రీ స్వర్ణ పతకాలు సొంతం చేసుకోగా, జె.షణ్ముఖ్, వేదాంతకుమార్, టి.హర్షవర్ధన్, నందు చౌదరి రజత పతకాలు, కె.హృతిక వర్మ కాంస్య పతకాలు సాధించారు. కుమిటి ఈవెంట్‌లో పి.భవ్యశ్రీ, వి.అర్విన్, సరబ తీర్థి కాంస్య పతకాలు దక్కించుకున్నారు. పతకాలు సాధించిన చిన్నారి క్రీడాకారులను రాష్ట్ర వాడోక్కై కరాటే డో సంఘం అధ్యక్షుడు చిగురుపల్లి సతీష్‌కుమార్ అభినందించారు.

బీసీ కాలనీలో అన్నదానం

ఆరిలోవ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 12వ వార్డులోని బి.సి. కాలనీలో వినాయక నవరాత్రుల సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కుమారుడు వెలగపూడి ప్రతాపరుద్ర పాల్గొన్నారు. స్వయంగా భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. సుమారు 2000 మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.


వడ్డిస్తున్న వెలగపూడి ప్రతాపరుద్ర

జూ పార్కుకు సందర్శకుల తాకిడి

ఆరిలోవ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధి జూలాజికల్ పార్కులో ఆదివారం సందర్శకుల తాకిడి పెరిగింది. 2,215మంది సందర్శించారు. వీరి ద్వారా సుమారు రూ.1.84 లక్షల ఆదాయం సమకూరినట్లు క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.

వైద్య ఉద్యోగుల హక్కుల సాధనకు పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న గిరిబాబు

ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గిరిబాబు

పెదవాల్తేరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వైద్య ఉద్యోగుల హక్కుల సాధనకు పోరాడాలని నిర్ణయించినట్లు ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గిరిబాబు పేర్కొన్నారు. 36% తాత్కాలిక భృతి ప్రకటన, 12వ వేతన కమిటీ ఛైర్మన్ నియామకం, పెండింగ్ డీఏల చెల్లింపు డిమాండ్లు నెరవేర్చాలని ఆయన కోరారు. ఏఐటీయూసీ అనుబంధ, ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘం విశాఖపట్నం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం పెదవాల్తేరు టీబీ హాస్పిటల్ ఆవరణలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.అప్పారావు అధ్యక్షతన జరిగింది. ఇందులో గిరిబాబు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసి హక్కులు పొందిన విషయాన్ని గుర్తుచేశారు. ఇందులో చాలా సమస్యలు పరిష్కారం కావడంలేదని పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ఏపీసీవోఎస్ కొనసాగించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయి సత్యనారాయణ మాట్లాడుతూ సంపాదిత సెలవులకు నగదు చెల్లింపు, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌లో పదోన్నతులు, వైద్య విద్యాసంచాలకుల విభాగంలో ఇన్ సర్వీస్ శిక్షణ పూర్తి చేసిన ల్యాబ్ అటెండెంట్, ల్యాబ్ టెక్నీషియన్‌లకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ల్యాబ్ సూపర్‌వైజర్, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 1 పోస్టులు, చీఫ్ రేడియోగ్రాఫర్ పోస్టులు మంజూరు చేసి పదోన్నతులు కల్పించాలని కోరారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు బదిలీ సౌకర్యం కల్పించాలని కోరారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 35 రోజుల సాధారణ సెలవులు, ఫార్మసీ విభాగంలో పని చేసేవారికి ఆరోగ్యశ్రీ స్టాఫ్ ఇన్సెంటివ్ చెల్లింపు, ఈసీజీ టెక్నీషియన్ పోస్టుల భర్తీ, డేటా నమోదు కోసం డీఈవోల నియామకం, ఎంఎన్‌ఓలకు అదనపు హెచ్‌ఆర్ఏ, అర్హులకు హాస్పిటల్ అడ్మిన్ పదోన్నతులు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు 100% బేసిక్, డీఏ, హెచ్‌ఆర్ఏ చెల్లింపు, 126 జీవోని సవరించి ఈఎస్ఐ ఉద్యోగులకు పదోన్నతులు, జీవో 190 సవరించి మెడికల్ సబార్డినేట్ సర్వీస్ ఉద్యోగులకు ఎమ్మెన్ డబ్ల్యూ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పడాల రమణతో డైమండ్ జూబ్లీ ఉత్సవాలలోగోను ఆవిష్కరింపజేశారు. సారిపిల్లి గంగరాజు, కొర్రయి రమేష్, ఎస్కే ఇబ్రహీం, ధనంజయ్, శివశంకర్, రమాశంకర్, మహ్మద్ దురాని, ఎంఎస్ రఘునాథరావు పాల్గొన్నారు.

ముగిసిన భారత మహిళా క్రికెటర్ల శిక్షణ

విశాఖపట్నం స్పోర్ట్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరుగుతున్న భారత మహిళల క్రికెట్ జట్టు శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఐసీసీ మహిళల వరల్డ్ కప్ క్రికెట్ టోర్నీకి భారత మహిళా క్రికెటర్లు అన్ని రంగాల్లో సన్నద్ధమవుతున్నారు. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక శిక్షణలో బ్యాటర్లు, బౌలర్ల ప్రతిభను మెరుగుపరిచే ప్రత్యేక శిక్షణ జరిగింది. నిర్ణీత ఓవర్లలో బ్యాటింగ్‌లో పరుగులు సాధించడం, బౌలింగ్‌లో వికెట్లు పడగొట్టే నైపుణ్యం ప్రత్యేక సెషన్‌లో మహిళా క్రికెటర్లు ప్రతిభను ప్రదర్శించారు. ఎనిమిది రోజులు ఇక్కడ జరిగిన సన్నాహక శిబిరంలో భారత జట్టు మహిళా క్రికెటర్లు హర్మన్‌ప్రీత్ కౌర్, రేణుక సింగ్ ఠాకూర్, రాధా యాదవ్, అరుంధతి రెడ్డి, రిచా ఘోష్, దీప్తి శర్మ, స్నేహ రానా, హర్లీన్, ప్రతిక రావల్, స్మృతి మందాన, జెమిమా పాల్గొన్నారు.


మైదానంలో సమాలోచనలు చేస్తున్న క్రికెటర్లు

రేపటి నుంచి ఏసీఏ మహిళల టీ-20 లీగ్

ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో మంగళవారం నుంచి ఏసీఏ మహిళల టీ-20 లీగ్ టోర్నీ జరగనుంది. సెప్టెంబరు 9 వరకు జరిగే ఈ టోర్నీలో నాలుగు జట్లు పాల్గొంటున్నాయి. రోజూ రెండు మ్యాచ్‌లు జరిగేలా నిర్వాహకులు షెడ్యూల్ రూపొందించారు.

ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా?

ఆరిలోవ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శ్రీకాంత్‌నగర్ సమీపంలోని కనకమహాలక్ష్మి క్యాటరింగ్ నిర్వాహకులు విద్యుత్ స్తంభాన్ని మూసేసి మరీ రేకుల షెడ్డు వేశారు. ఇలా వేయడం వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు స్తంభంపైకి వెళ్లడం కూడా ఇబ్బందికరంగా ఉంటుంది. అనుకోకుండా విద్యుత్ రేకులకు ప్రసరిస్తే ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉంటుంది. ఇంత జరిగినా విద్యుత్ సిబ్బంది తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


శ్రీకాంత్‌నగర్ వద్ద స్తంభాన్ని ఆనుకుని వేసిన రేకుల షెడ్డు

రేపటి నుంచి దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి, ఛత్ పూజలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 06559 నంబరు గల రైలు సెప్టెంబరు 2 నుంచి నవంబరు 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 11.40 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 6.18 గంటలకు దువ్వాడ, శుక్రవారం ఉదయం 5 గంటలకు నారంగి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 06560 నంబరు గల రైలు సెప్టెంబరు 6 నుంచి నవంబరు 29 వరకు ప్రతి శనివారం ఉదయం 5.30 గంటలకు నారంగిలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 9.45 గంటలకు బెంగళూరు చేరుతుంది. 07046 నంబరు గల రైలు నవంబరు 29 వరకు ప్రతి శనివారం ఉదయం 8.40 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 9.13 గంటలకు దువ్వాడ, సోమవారం సాయంత్రం 4 గంటలకు నహర్లగున్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07047 నంబరు గల రైలు సెప్టెంబరు 2 నుంచి డిసెంబరు 2 వరకు ప్రతి మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు నహర్లగున్‌లో బయలుదేరి గురువారం ఉదయం 8.15 గంటలకు దువ్వాడ, రాత్రి 9.30 గంటలకు చర్లపల్లి చేరుతుంది. 03430 నంబరు గల రైలు నవంబరు 11 వరకు ప్రతి మంగళవారం సాయంత్రం 5.15 గంటలకు మాల్దా టౌన్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు దువ్వాడ, గురువారం ఉదయం 4 గంటలకు చర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 03429 నంబరు గల రైలు సెప్టెంబరు 2 నుంచి నవంబరు 13 వరకు ప్రతి గురువారం సాయంత్రం 4.50 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.50 గంటలకు దువ్వాడ, శనివారం ఉదయం 5 గంటలకు మాల్దా టౌన్ చేరుతుందని డీసీఎం సందీప్ పేర్కొన్నారు

కారు ఢీకొని ద్విచక్ర వాహనచోదకుడికి తీవ్రగాయాలు

ఆరిలోవ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): హనుమంతవాక జంక్షన్ నుంచి అడవివరం వైపు ఆదివారం అతివేగంగా వెళ్తున్న ఓ కారు దారపాలెం సమీపంలో ద్విచక్ర వాహన చోదకుని ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహన చోదకుడి కాలికి గాయమైంది. వెంటనే స్థానికులు 108కి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వారు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడి వివరాలు తెలియలేదు. వాహనం కూడా పాడైనట్లు స్థానికులు చెప్పారు. ఈ ప్రమాద విషయంలో తమకు ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

మహారాణిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సెప్టెంబరు 2న విశాఖ రానున్న సందర్భంగా జిల్లా అధికారులు ఆదివారం సాయంత్రం ఏర్పాట్లను సమీక్షించారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లు నేవల్ కోస్టల్ బ్యాటరీ వద్ద గల హెలిపాడ్‌లను, అక్కడ చేపట్టవలసిన పనులను పరిశీలించారు. మంగళవారం జరగబోయే ఈస్టు కోస్టు మారిటైం అండ్ లాజిస్టిక్ సమ్మిట్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానున్నందున అక్కడ ఏర్పాట్లపై కూడా చర్చించారు. ముఖ్యమంత్రి గ్రీన్ రూమ్, వీఐపీల సిటింగ్, ప్రొటోకాల్ తదితర అంశాలపై ఉన్నతాధికారులు సమీక్షించారు.

ఐటీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఐటీ కార్యాలయంలో ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా ఇంద్రజిత్ అన్నె, కార్యదర్శిగా శ్రీధర్ సరగడం, కోశాధికారిగా అనుపమ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దాసరి కిశోర్ ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని ఐటీ, ఐటీ ఆధారిత సేవలందించే ప్రముఖ సంస్థల ప్రతినిధులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఎన్నికకు ముందు పూర్వపు అధ్యక్షురాలు ముక్కవల్లి లక్ష్మి గత ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. అనంతరం సంబంధిత నివేదికను నూతన కార్యవర్గానికి అందజేశారు.

'లోకేశ్‌కు సమస్యలు వివరించా'

మురళీనగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేశ్‌ను కలిసి స్థానిక సమస్యలు వివరించినట్లు టీడీపీ నేత ఎస్.వరప్రసాద్ తెలిపారు. ఉత్తర నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని, 17 వార్డుల్లో తన దృష్టికి వచ్చిన అంశాలను వివరించానన్నారు. 22ఎ జాబితాలో ఉండిపోయిన భూముల కారణంగా యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు పరిష్కరించాలని కోరానన్నారు.

భవనం పైనుంచి జారి పడి కార్మికురాలి మృతి


సత్యాలు

సాగర్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పెద్ద రుషికొండ ఐటీ హబ్‌లో ఉన్న ఆదిత్య అపార్టుమెంట్ వెనుక ప్రాంతంలో నిర్మాణంలో వున్న బహుళ అంతస్తు భవనం పైనుంచి ప్రమాదవశాత్తు జారి పడి భవన నిర్మాణ కార్మికురాలు మృతి చెందింది. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆరిలోవలోని తోటగరువు ప్రాంతానికి చెందిన చందక సింహాచలం, సత్యాలు (48) కొద్ది రోజులుగా ఆదిత్య అపార్టుమెంట్ వెనుక నిర్మాణంలో వున్న బహుళ అంతస్తు భవనంలో పని చేస్తున్నారు. ఆదివారం రెండో అంతస్తులో పనికి వెళ్లిన సత్యాలు కళ్లు తిరిగి అక్కడి నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందింది. భవనం యజమాని సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఐక్యతకు క్రీడలు దోహదం: డీఆర్ఎం బొహ్రా

» వాల్తేరు రైల్వేలో ఫిట్ ఇండియా, జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఇతర ఉద్యోగులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహించిన మూడు రోజుల ఫిట్ ఇండియా, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఇతర అధికారులు, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని 'శాంతియుత సమాజాన్ని ప్రోత్సహించేదే క్రీడ' అనే నినాదంతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ ఐక్యత నెలకొల్పడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం నేపథ్యంలో మూడు రోజులుగా డివిజన్ వ్యాప్తంగా ఫిట్ ఇండియా కార్యక్రమాలు నిర్వహించామని, రోజుకు కనీసం గంటపాటు శారీరక వ్యాయామం చేయడం ద్వారా క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు శారీరక పరిపుష్టి పొందడంపై అవగాహన కల్పించామన్నారు. క్రీడాస్ఫూర్తిని పాటించడం, క్రీడలను ప్రోత్సహించడంలో వాల్తేరు రైల్వే అంకితభావంతో నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రాణించిన రైల్వే క్రీడాకారులతోపాటు క్రీడల్లో రాణిస్తున్న ఉద్యోగుల పిల్లలను వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల మధ్య బంధాలను బలోపేతం చేయడంలో క్రీడల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, నిరంతర సాధనతో క్రీడల్లో రాణిస్తున్నవారికి ఉన్నత భవిష్యత్తు ఉంటుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, స్పోర్ట్సు ఆఫీసర్ హరినాథ్, ఇతర అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, ఇతర నాయకులు

ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమం

సీతమ్మధార, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం చేపట్టిన మన్ కీ బాత్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఉత్తర నియోజకవర్గం 181వ బూత్ 14వ వార్డు సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమం ఏర్పాట్లను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, ఇతర నాయకులు పాల్గొని మన్ కీ బాత్‌లో ప్రధాని ప్రసంగాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

క్యారమ్స్‌లో విశాఖ క్రీడాకారుల సత్తా



పురుషుల విభాగంలో సిహెచ్ జనార్ధనరెడ్డి, మహిళల విభాగంలో ఎ.భవానీలు ప్రథమ బహుమతులు అందుకుంటున్న దృశ్యం

చిలకలూరిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఆర్ క్లబ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీల్లో విశాఖ క్రీడాకారులు సత్తా చాటారు. పురుషుల, మహిళల విభాగాల్లో విశాఖపట్టణానికే చెందిన సీహెచ్. జనార్దన్‌రెడ్డి, ఎ.భవాని ప్రథమ బహుమతులు అందుకున్నారు. రాష్ట్ర క్యారమ్ సంఘం ప్రధానకార్యదర్శి షేక్ అబ్దుక్ జలీల్, టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌వీరమణమూర్తి, అబ్జర్వర్ గద్దె వేణు పాల్గొన్నారు. జనార్దన్ రెడ్డికి క్యారమ్ మాల్దీవుల్లో జరిగే ప్రపంచ కప్ పోటీలకు వెళ్లేందుకు గాను సీఆర్ క్లబ్ తరపున కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు.

మత్తు ప్రేమికుల మధ్యలో 'మద్దీ'

» ఎండీఎంఏ కేసులో ప్రధాన సూత్రధారి

వైజాగ్ ప్రేమికులు దొరకడంతో పరారీ

(విజయవాడ, ఆంధ్రజ్యోతి)

వైజాగ్ ప్రేమికులకు ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను సమకూర్చిన మల్లెల మధుసూదన్‌రెడ్డి అలియాస్ మద్దీ ఎవరు? డ్రగ్స్ పురమాయించిన లోహిత్ యాదవ్‌కు, మద్దీకి పరిచయం ఎలా ఏర్పడింది? వైజాగ్ తీరానికి మాదకద్రవ్యాలు బెంగళూరు నుంచే వెళ్తున్నాయా? అంటే దర్యాప్తు బృందాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను బెంగళూరు నుంచి ట్రావెల్స్ బస్సులో వైజాగ్ తీసుకెళ్తుండగా, అర్జాల శ్రీవాత్సవ్, బొడ్డేపల్లి హవీల డిలైట్ అనే ప్రేమికులను ఈగల్ పోలీసులు విజయవాడలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారిద్దరికీ కోర్టు రిమాండ్ విధించింది. శ్రీవా త్సవ్‌తో ఎండీఎంఏ డ్రగ్‌ను రప్పిస్తున్న వైజాగ్‌కు చెందిన లోహిత్ యాదవ్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. మద్దీ సొంతూరు నెల్లూరు. డిగ్రీ చదివాడు. ఉపాధి కోసం బెంగళూరువెళ్లి ఎండీఎంఏను యువతకు సరఫరా చేయడం మొదలుపెట్టాడు. శ్రీవాత్సవ్, హవీల నుంచి ఫోన్‌పే ద్వారా డబ్బు అందుకుని ఎండీఎంఏను సమకూర్చాడు. బెంగళూరు మెట్రో రైల్వే స్టేషన్లకు సమీపంలో ఖాళీ ప్రదేశాలను, దుకాణాలను డ్రాపింగ్ పాయింట్లుగా చేసుకున్నాడు. డబ్బు ఖాతాలో జమకాగానే, డ్రాపింగ్ పాయింట్ ఫొటో, లొకేషన్‌ను వాట్సాప్‌లో పంపుతాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఖాళీ సిగరెట్ ప్యాకెట్లలో డ్రగ్‌ను అమర్చుతాడు. శ్రీవాత్సవ్, హవీల విజయవాడలో పోలీసులకు దొరికి పోయారని తెలియడంతో మద్దీ పరారయ్యాడు. వైజాగ్‌లో ఉన్న లోహిత్ యాదవ్‌కు మద్దీ ఎలా పరిచయమయ్యాడు, ఎంతమంది అతడితో సంప్రదింపులు చేశారనే దానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు.

డ్రగ్స్ తీసుకుంటూ వీడియోలు, ఫొటోలు

శ్రీవాత్సవ్, హవీల ప్రేమికులు. వీరి ఫోన్లను సీజ్ చేసిన పోలీసులు సాంకేతికంగా విశ్లేషిస్తున్నారు. శ్రీవాత్సవ్ ఫోన్ గ్యాలరీలో హవీలతో కలిసి డ్రగ్స్ తీసుకుంటున్న వీడియోలు, ఫొటోలనే సాక్ష్యాలుగా పోలీసులు కోర్టుకు అందజేయనున్నారు.

'ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలి'



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

అక్కయ్యపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని ఏపీ ఆటో డ్రైవర్లు, వర్కర్ల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్కయ్యపాలెం నాలుగులేన్ల రహదారి వద్ద ఆటో డ్రైవర్లు ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు పథకంతో ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం కల్పించాలన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం డీజిల్, పెట్రోల్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్డు ట్యాక్స్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువులు, వాహన విడి భాగాలు, టోల్ పంజా ధరలు భారీగా పెంచి డ్రైవర్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికృష్ణ, కేలం శివ, నూకరాజు పాల్గొన్నారు.

'ఢిల్లీరావు కార్మిక పక్షపాతి'


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

డాబాగార్డెన్స్ ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కార్మికవర్గం సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతగా పనిచేసిన నేత ఢిల్లీరావు అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కొనియాడారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఢిల్లీరావు సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి సీనియర్ నాయకులు పి.వెంకటరెడ్డి, ఎం.రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ కార్మిక రాజ్యం రావాలన్న కాంక్షతో దోపిడీ రహిత సమాజం కోసం ఆయన పనిచేశారన్నారు. సీపీఎం జిల్లా నాయకులు బి.పద్మ, బొట్టా ఈశ్వరమ్మ, వెంకటరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

క్వాంటం కంప్యూటింగ్ టూల్స్‌పై అవగాహన అవసరం


సదస్సులో మాట్లాడుతున్న క్వాంటం కంప్యూటింగ్ నిపుణుడు డాక్టర్ భాను ప్రకాశ్, వేదికపై ఇతర ప్రముఖులు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : క్వాంటం కంప్యూటింగ్‌లో టూల్స్ వినియోగం అత్యంత కీలకమని కేఎల్ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్, క్వాంటం కంప్యూటింగ్ నిపుణుడు డాక్టర్ కె. భానుప్రకాశ్ అన్నారు. ఏయూలోని కంప్యూటర్ సైన్స్ ఆల్గారిదమ్ సెమినార్ హాల్‌లో మూడు రోజులుగా క్వాంటం కంప్యూ టింగ్ ఇన్ సైట్స్ ఫర్ అకడమీషన్స్ ప్రోగ్రామ్ పేరుతో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో భానుప్రకాశ్ మాట్లాడుతూ క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన సెక్యూ రిటీ ప్రొవైడింగ్ సిస్టమ్స్ గురించి వివరించారు. భవిష్యత్‌లో గొప్ప అవకాశాలను క్వాంటం కంప్యూటింగ్ నిపు ణులు దక్కించుకుంటారన్నారు. కోల్‌కతాలోని టీసీఎస్ కంపెనీ టెక్నికల్ లీడ్ అండ్ క్వాంటం రీసెర్చర్ రాహుల్ రాణా మాట్లాడుతూ క్వాంటం ఆప్టమైజేషన్‌కు సంబంధించిన టెక్నిక్స్‌ను వివరించారు. ఏయూ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె. వెంకటరావు మాట్లాడుతూ క్వాంటం కంప్యూటింగ్ అంటే ఏమిటి, సూపర్ పొజిషన్, ఎంటాంగిల్‌మెంట్, దాని ఉపయోగాలు వంటి అంశాలను తెలిపారు. దేశంలో క్వాంటం కంప్యూటింగ్ కోర్సును ప్రారంభించిన వర్సిటీగా ఏయూ గుర్తింపు సాధించినట్టు చెప్పారు. ఏపీ ప్రభుత్వం, నేషనల్ క్వాంటం మెషిన్‌లో భాగంగా క్వాంటం టెక్నాలజీని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ క్రమంలోనే అమరావతిలో క్వాంటం కంవ్యాలీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓషూ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ కో-ఫౌండర్ అండ్ ఎండీ ఎన్. భానుమూర్తి, సదస్సు కో-కన్వీనర్లు డాక్టర్ కె. రాజ్‌కుమార్, డాక్టర్ కేవీ రమణ, ప్రొఫె సర్ శశి, ప్రొఫెసర్ వల్లీ కుమారి, ప్రొఫెసర్ లలితా భాస్కరి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన సమయం..పారాహుషార్

» పోలీసు సిబ్బంది, స్విమ్మర్లను అప్రమత్తం చేసిన సీఐ


సిబ్బందికి సూచనలు చేస్తున్న వన్‌టౌన్ సీఐ జి.దేముడుబాబు

మహారాణిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనం సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పోలీసు సిబ్బందికి వన్‌టౌన్ సీఐ జి.దేముడు బాబు ఆదివారం అవగాహన కల్పించారు నేవల్ కోస్టల్ బ్యాటరీ వద్ద గణేశ్ నిమజ్జనాలు పెద్దఎత్తున జరగనున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగరూకతతో ఉండాలో అదే స్థలం వద్ద సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. ఎవరూ సముద్రం లోపలకు వెళ్లకుండా గమనించాలని, పొరపాటున వెళ్లినా వారి ప్రాణాలు పోగొట్టుకోకుండా స్విమ్మర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు ఆదివారం జరిగిన నిమజ్జన కార్యక్రమంలో భీమిలి తదితర ప్రాంతాల్లో లైఫ్ గార్డులు కొందరి ప్రాణాలు కాపాడిన నేపథ్యంలో అప్రమత్తం చేశారు. సమావేశంలో మెరైన్ పోలీసులు కూడా పాల్గొన్నారు.

రౌడీషీటర్ ఖాజాపై ఇనుప రాడ్డు, కర్రలతో దాడి

» కేజీహెచ్‌లో చికిత్స..అదుపులో నిందితులు

సీతంపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి రైల్వే క్వార్టర్స్‌లో పేకాడుతున్న కొంత మంది మధ్య గొడవలు జరిగాయి. అందులో ఒకరైన రౌడీ షీటర్ ఖాజాపై కొంత మంది ఇనుప రాడ్లు, కర్రలతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన అతడిని కొంత దూరం వాహనంపై తీసుకువెళ్లి పడవేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రైల్వే న్యూకాలనీ క్వార్టర్స్‌లో సాయిబాబా ఆలయం సమీపంలో రౌడీ షీటర్ ఖాజా, బెనర్జీ, బాబ్జీ, బంగారం షాపు శ్రీను, మరో నలుగురు శనివారం రాత్రి పేకాడుతున్నారు. ఆ సమయంలో వారి మధ్య గొడవలు జరిగాయి. దీంతో రౌడీషీటర్ ఖాజాను అక్కడే పేకాడుతున్న మరో రౌడీషీటర్ ఈశ్వరరావు ఎలియాస్ దిండు, మరి కొంత మంది కలిసి ఇనుప రాడ్లు, కర్రలతో తలపై గట్టిగా కొట్టారు. అంతటితో ఆగకుండా గాయాలపాలైన ఖాజాను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని అల్లిపురంలోని డీఆర్ఎం కార్యాలయం వద్ద పడవేశారు. అతని వద్ద నుంచి రూ.22 వేల నగదును పట్టుకుపోయారు. అయితే ఖాజాను ఆటోలో అబ్దుల్లా అనే వ్యక్తి చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. సంఘటన జరిగిన వివరాలను తెలుసుకున్న నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ ఉమాకాంత్ తన సిబ్బందితో వెళ్లి దర్యాప్తు చేపట్టారు. దాడి జరిగిన సమయంలో అక్కడున్న బెనర్జీ శివ, సాగర్ అనే ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ దాడి సంఘటనపై నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి దృష్టి సారించి రౌడీషీటర్ల ఆగడాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడిలో పాల్గొన్న వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, తక్షణమే వారిని అదుపులోకి తీసుకోవాలని స్టేషన్ అధికారులను ఆదేశించారు.

నాట్యగణపతిగా దర్శనం


అక్కయ్యపాలెంలోని ఆంధ్రజ్యోతి కార్యాలయం సమీపంలోని లక్ష్మీగణపతి ఆలయంలో వినాయకుడ్ని ఆదివారం నాట్య గణపతిగా అలంకరించిన దృశ్యం -ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



మహారాణిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : గోకుల్ బీచ్ రోడ్డు వద్ద బార్ వెనుక భాగంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో వింటేజ్ బార్ వెనుక మృతదేహం ఉన్నట్టు స్థానికులు గుర్తించి, మహారాణిపేట పోలీసులకు సమాచారం అందిం చారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతుడు భీమునిపట్నంకు చెం దిన ఎల్లాజీ (30)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీ హెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలు

మహారాణిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై బైక్ బోల్తా పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఓల్డ్ ఐటీఐ ప్రాంతానికి చెందిన రాజేష్ (25), ఉదయ్ (27) ఆదివారం సాయంత్రం బైక్‌పై ఆర్‌కే బీచ్‌కు వెళ్లారు. రాత్రి అక్కడి నుంచి సంపత్‌వినాయక టెంపుల్ మీదుగా తిరిగి వస్తుండగా ఫ్లైఓవర్‌పై బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెం టనే స్థానికులు వారిని కేజీహెచ్‌కు తరలించారు.

ఆర్టీసీ సిబ్బందికి అవస్థలు

... 3వ పేజీ తరువాయి

ఉండిపోతే, వారిస్థానంలో మరో డ్రైవర్, కండక్టర్ డ్యూటీ ఎక్కి బస్సుని తిరిగి విజయవాడ, అమలాపురం, రాజోలు, తాడేపల్లిగూడెం, తెనాలి వంటి దూర ప్రాంతాలకు వెళతారు. అక్కడి నుంచి వచ్చిన డ్రైవర్లు, కండక్టర్లు విశ్రాంతిభవనంలో నిద్రపోయి మరుసటిరోజు ఉదయం తిరిగి డ్యూటీ ఎక్కుతారు. అయితే విశ్రాంతి భవనంలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ భవనంలో 13 మంచాలు ఫ్యాన్‌లను ఏర్పాటుచేశారు. ఒకటి, రెండు మినహా మిగిలిన ఫ్యాన్‌లు తిరగడం లేదు. దీంతో తీవ్ర ఉక్కపోతతో సిబ్బంది సతమతమవుతున్నారు. మరోవైపు విశ్రాంతిభవనం పైకప్పు సిమెంట్ రేకులతో నిర్మించడంతో చిన్నపాటి ఎండకాస్తే ఉక్కపోత, వేడిపెరిగిపోతోందని వాపోతున్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదుచేసినా కనీసం స్పందనలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుదూరప్రాంతాల నుంచి బస్సులో విధులు నిర్వర్తించి, విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో కనీసం కూర్చోవడానికి కూడా అవకాశం లేని దుర్భర పరిసితులు నెలకొనడంతో, మరుసటిరోజు విధి నిర్వహణ సవాల్‌గా మారుతోందని వాపోతున్నారు. అధికారులు సిబ్బంది సంక్షేమంతోపాటు ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని విశ్రాంతి భవనంలో సమస్యలను పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు.

పెద్దాస్పత్రి దశ తిరిగేనా?

... 3వ పేజీ తరువాయి

సదుపాయాలు లేవు. కొన్నిచోట్ల చోరీలు జరుగుతున్నాయి. వర్షం వస్తే ఉండలేని పరిస్థితులున్నాయి.

వైద్యులపై దృష్టి సారించాలి..

కొన్నాళ్లుగా కీలకకేసుల్లో ఆస్పత్రి వైద్యుల పాత్ర బహి ర్గతమవుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి వైద్యులకు హెచ్చ రికలు జారీచేయాల్సి ఉంది. కీలకస్థానాల్లోని అధికారులు, విభాగాధిపతులు ప్రైవేటు సేవల్లో తరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆస్పత్రి పనివేళల్లో కొందరు వైద్యులు ప్రైవేటు కు ప్రాధాన్యతనిస్తుండడంతో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదనే విమర్శలున్నాయి. వీటిపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించాలి.

భవనాలపై దృష్టి సారించేనా.?

గత ప్రభుత్వ హయాంలో ఆస్పత్రిలోని కొన్ని విభాగాల భవనాలను కూల్చివేశారు. నూతన భవనాలకు ప్రతిపాదనలు చేసి నాడు-నేడులో భాగంగా పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. నిధులు మంజూరు చేయకపోవడం, ఇతర కారణాలతో పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో నూతన భవన నిర్మాణాలు చేపట్టేలా మంత్రి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేషన్ డిపోలకు స్మార్ట్ రైస్ కార్డులు

... 3వ పేజీ తరువాయి

అధికారులు ఆదేశించారు. దీనిపై కార్డుదారులు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు. ఎండీయూ వాహనాలు వచ్చిన తరువాత నాలుగేళ్ల నుంచి డీలర్లకు, కార్డుదారుల మధ్య సంబంధాలు చాలా వరకు నిలిచిపోయాయి. ఎండీయూలు వచ్చిన తరువాత నగరంలో చాలా వరకు డిపోలు వేర్వేరు చోట్లకు తరలించారు. మూడు నెలల క్రితం ఎండీయూలు రద్దుచేసిన తరువాత తిరిగి సరకుల పంపిణీ బాధ్యత డిపోలకు అప్పగించారు. ఈ కాలంలో కార్డుదారులను మ్యాపింగ్‌చేసిన డిపోలకు కాకుండా తమకు అందుబాటులో ఉన్న డిపోల నుంచి సరకులు తీసుకుంటున్నారు. మ్యాపింగ్ అయిన కార్డుదారుల కోసం కొందరు డీలర్లు అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్మార్ట్ కార్డుల పంపిణీ రేషన్ సవాల్‌గా మారుతుందని డీలర్లు చెబుతున్నారు. శనివారం ఆరిలోవలో ఒక డిపో వద్ద కార్డుల పంపిణీ కోసం వేచి వున్న పలువురి కార్డులు డిపోలో లేవని తేలడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్వార్టర్స్ అద్దెకిచ్చిన ఉక్కు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు?

సన్నద్ధమవుతున్న స్టీల్ ప్లాంట్ యాజమాన్యం

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఉద్యోగులకు బదులు ఇతరులు నివాసం ఉంటుండడాన్ని ఉక్కు యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ఉద్యోగులకు కేటాయించిన క్వార్టర్స్‌ను తాము నివాసం ఉండకుండా బయట వ్యక్తులకు అద్దెకు ఇచ్చిన వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు యాజమాన్యం సిద్ధపడుతున్నట్టు తెలిసింది. స్టీల్ ప్లాంటులో ఉద్యోగం చేస్తున్న ఉద్యోగులకు ఏ, బీ, సీ, డీ టైప్ క్వార్టర్స్ ఉన్నాయి. అయితే సీ, డీ క్వార్టర్స్‌లో అధికారులు, ఉన్నతాధికారులు నివాసం ఉంటారు. ఏ, బీ టైప్ క్వార్టర్స్‌లో కార్మికులు నివాసం ఉంటారు. అయితే గత పదేళ్ల క్రితం నుంచి ప్లాంటులో జాయిన్ అయిన ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ వర్తించదని, తప్పనిసరిగా క్వార్టర్స్ తీసుకోవాలని యాజమాన్యం షరతు విధించడంతో వారు వాటిని తీసుకున్నారు. వీరిలో చాలామందికి సొంతిళ్ల


స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లోని ఓ క్వార్టర్స్ భవనం

ఉండడంతో తమకు కేటాయించిన క్వార్టర్స్‌ను ఇతరులకు అద్దెకు ఇచ్చారు. క్వార్టర్స్ తీసుకున్నా, తీసుకోకపోయినా హెచ్‌ఆర్‌ఏ వర్తించదని ఉక్కు యాజమాన్యం స్పష్టం చేయడంతో సొంతిళ్లు గల ఉద్యోగుల్లో అత్యధికులు తమకు కేటాయించిన క్వార్టర్స్‌ను బయట వ్యక్తులకు అద్దెకు ఇచ్చేశారు. ఈ విషయం అధికారులకు తెలిసినప్పటికీ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించారు. కాగా ఉక్కు క్వార్టర్స్‌లో ఇతరులు నివాసం ఉంటున్నారని పలువురు యాజమాన్యానికి ఫిర్యాదు చేయడంతో ప్రస్తుతం ప్లాంటులో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా అధికారులు స్పందించినట్టు సమాచారం. తాము నివాసం ఉండకుండా ఇతరులకు క్వార్టర్స్ అద్దెకు ఇచ్చిన ఉద్యోగులపై చర్యలు తీసుకునేందుకు యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. దీంతో టౌన్‌షిప్‌లో నివాసముంటున్న వందలాది మంది బయట వ్యక్తులు క్వార్టర్స్ ఖాళీ చేయాల్సిందే. అదే సమయంలో సదరు ఉద్యోగులపై ఉక్కు యాజమాన్యం చర్యలు తీసుకుంటుందని భోగట్టా!

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెందుర్తి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందినట్టు పెందుర్తి సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపారు. మృతుడి వయసు సుమారు 55 ఏళ్లు ఉండవచ్చన్నారు. మతి స్థిమితం లేకపోవడంతో తాము ఈ వ్యక్తిని స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో చేర్పించామన్నారు. అక్కడ అనారోగ్యానికి గురవ్వడంతో నిర్వాహకులు కేజీహెచ్‌లో చేర్పించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్టు పేర్కొన్నారు. మృతదేహాన్ని కేజీహెచ్



మార్చురీలో భద్రపరిచామని, ఎవరికైనా మృతుడి వివరాలు తెలిస్తే 94407 96039 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.


రక్తదానం చేస్తున్న జనసైనికులు

ఎస్ఆర్ పురంలో జనసైనికుల రక్తదానం

పెందుర్తి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఆర్ పురంలో ఆదివారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ముందస్తుగా జనసేన కార్యకర్తలు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ దూది విజయలక్ష్మి ప్రారంభించిన ఈ శిబిరంలో 30 మంది జనసైనికులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గొరలపల్లి సోమునాయుడు, జనసేన నాయకులు దూది వెంకటరమణ, కాయితి ఎర్రిబాబు, తదితరులు పాల్గొన్నారు.

59.3 అడుగులకు 'మేహాద్రిగెడ్డ' నీటిమట్టం

60 అడుగులకు చేరితే నీటిని విడుదల చేస్తామన్న జలాశయం సిబ్బంది

ఎంతో కాలంగా పనిచేయని రెండు గేట్లు

రిజర్వాయర్ నిర్వహణపై అధికారుల శీతకన్ను

గోపాలపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం 59.3 అడుగులకు చేరింది. గతనెల వరకు 49 అడుగుల వద్దనున్న నీటిమట్టం ప్రస్తుతం పది అడుగుల మేర పెరిగింది. రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవడంతో చెరువులు నిండి పెద్ద మొత్తంలో వరద నీరు రిజర్వాయర్‌కు చేరుతుంది. దీంతో ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం స్థిరంగా 59.3 అడుగులు ఉందని జలాశయం సిబ్బంది తెలిపారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 61 అడుగులు కాగా నీటిమట్టం పెరిగి 60 అడుగులకు సమీపిస్తే రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు. రిజర్వాయర్ నీటి


స్పిల్‌వే వద్ద గరిష్ఠ స్థాయికి చేరువలో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీరు

మట్టం పెరగడంతో ఇక్కడి సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతంలో తేలిక పాటి వర్షాలు కురిసినా జలాశయానికి వరద నీరు పోటెత్తే అవకాశం ఉంది.

పనిచేయని రిజర్వాయర్ రెండు గేట్లు

నగర ప్రజల దాహార్తిని తీర్చడంలో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ కీలకపాత్ర పోషిస్తోంది. నిత్యం 8 నుంచి 12 ఎంజీడీల నీటిని తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తారు. వ్యవసాయం, పారిశ్రామిక అవసరాల కోసం మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌ను నిర్మించారు. అయితే ప్రస్తుతం జలాశయం నీటిని పూర్తిగా తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగిస్తున్నారు. దీంతో రిజర్వాయర్ నిర్వహణకు కావల్సిన నిధులను జీవీఎంసీ మంజూరు చేస్తే నీటి పారుదల శాఖ నిర్వహణ చేపడుతుంది. రిజర్వాయర్ స్పిల్‌వేకు 40 అడుగుల వెడల్పులో 6 గేట్లు ఉన్నాయి. రిజర్వాయర్‌లో నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరితే అవసరాన్ని బట్టి 6 గేట్లను కూడా ఒకేసారి ఎత్తి వరద నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. అయితే చాలాకాలంగా రిజర్వాయర్ స్పిల్‌వేలోని 2 గేట్లు పనిచేయడం లేదు. ఎటువంటి అత్యవసర పరిస్థితిలోనైనా కేవలం 4 గేట్లు మాత్రమే ఎత్తే అవకాశం ఉంది. కాగా ఈ 4 గేట్లు ఎత్తిన తరువాత కిందకు దించడంలో ఇబ్బంది ఎదురవుతుంది. నగరంలో ఎంతో కీలకమైన మేహాద్రిగెడ్డ జలాశయం నిర్వహణపై అధికారులు శీతకన్ను వేయడంతో రిజర్వాయర్ నానాటికీ అధ్వాన స్థితికి చేరుకుంటుంది. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో రిజర్వాయర్ నిర్వహణకు చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం లేకపోలేదు.

కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలంటూ సీపీఎం ధర్నా

గాజువాక, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గంగవరం అదానీ పోర్టు నుంచి వస్తున్న కాలుష్య నివారణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం గాజువాక వై-జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీఎం గాజువాక నియోజకవర్గ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ కాలుష్యం వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికే కాలుష్యం మూలంగా అనేకమంది తీవ్ర అనారోగ్య సమస్యలతో నానాపాట్లు పడుతున్నా పోర్టు యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాలుష్య సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్ర ప్రసాద్, బి.రమణ, కిరీటం, నవాజ్, అశోక్, ఆనంద్, భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.




దాడి శ్రీనును సత్కరిస్తున్న దృశ్యం

దాడి శ్రీనుకు సేవారత్న పురస్కారం

పెందుర్తి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీనుకు రాష్ట్ర స్థాయి సేవారత్న పురస్కారం లభించింది. అవయవ, నేత్ర దానం, సమాజహిత సేవా కార్యక్రమాలను చేపడుతున్నందుకుగాను శ్రీనుని ప్రజాసంకల్ప వేదిక సంస్థ ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ మేరకు ఆదివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు మదిరే రంగసాయిరెడ్డి శ్రీనుకు సేవారత్న పురస్కారాన్ని అందజేసి దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపరచాలని ఉక్కు కార్మిక సంఘ నాయకులు కోరుతున్నారు. ఇటీవల చాలామంది ఉద్యోగులు వీఆర్ఎస్, పదవీ విరమణ చేయడంతో చాలావరకు వైద్య సేవలు తగ్గిపోయాయన్నారు. వైద్యులను నియమించి,పూర్తి స్థాయిలో సేవలందించడంతో పాటు మందులను అందుబాటులో ఉంచాలన్నారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 38, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 36, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 50, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 86, కీరదోస 30, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	113
లైవ్ ధర	133
విత్ స్కిన్	236
స్కిన్‌లెస్	246

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు

సర్కారు స్థలాల పరిరక్షణకు తహశీల్దార్ రమేశ్‌నాయుడు చర్యలు

మల్కాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ములగాడ మండలంలో ఆక్రమణలకు గురైన పలు ప్రభుత్వ స్థలాల్లో తహశీల్దార్ రమేశ్‌నాయుడు ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డులను సిబ్బంది ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కబ్జాదారులు బెంబేలెత్తిపోతున్నారు. తహశీల్దార్‌గా రమేశ్‌నాయుడు బాధ్యతలు చేపట్టాక ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయి అనే దానిపై సర్వే చేయించగా, పలుచోట్ల సర్కారు స్థలాలు కబ్జాకు గురైనట్టు గుర్తించారు. దీంతో ఆయా స్థలాల పరిరక్షణ కోసం ఇది ప్రభుత్వ భూమి అంటూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయిస్తున్నారు.కాగా ఇప్పటికే పలుచోట్ల ఆక్రమించిన స్థలాలను కబ్జాదారులు గుట్టుచప్పుడు కాకుండా అమ్మేయడంతో ఇప్పుడు వాటిని కొనుగోలు చేసిన వారు గగ్గోలు పెడుతున్నారు. ఈ



హిమాచల్‌నగర్‌లోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన బోర్డు

క్రమంలో కొనుగోలుదారులు, అమ్మకందారుల మధ్య అంతర్గతంగా గొడవలు కూడా జరుగుతున్నాయి.



పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

పెదగంట్యాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 64వ వార్డు కొత్త దిబ్బపాలేనికి చెందిన కదిరి గుణవతికి పెట్టిన బిడ్డను అనారోగ్యం కారణంగా ప్రైవేటు ఆస్పత్రిలో ఐసీయూలో ఉంచి చికిత్స చేయడంతో అధిక మొత్తంలో ఖర్చయింది. ఈ మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.61,571 చెక్కును టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు


బాధితులకు చెక్కులు అందజేస్తున్న పల్లా శ్రీనివాసరావు

ఆదివారం గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో అందజేశారు. అలాగే అనారోగ్యంతో చికిత్స పొందుతున్న యారాడ నివాసి రెడ్డి సన్యాసిరావుకు మంజూరైన రూ.55 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, టీడీపీ 64వ వార్డు అధ్యక్షుడు కొవిరి హరికృష్ణ, నాయకులు కదిరి పోలరాజు,యారాడ చిట్టి, పిళ్లా కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: అనారోగ్యంతో బాధపడుతున్న 73వ వార్డు ప్రాంతానికి చెందిన దువ్వారపు సోహంత్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.62,893ను చెక్కు రూపంలో ఆదివారం బాధితుని తల్లికి ఇక్కడి పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అందజేశారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఇస్తున్నామని, ప్రజలందరూ ఆనందంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు సింగూరు అనంత్, నమ్మి సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.





స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమ కార్యాచరణ

శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

మద్దిలపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంలో కూటమి ప్రభుత్వం తీరును వ్యతిరేకిస్తూ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ


సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఇతర పార్టీల నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో పాటు విశాఖలో రూ.వేల కోట్ల విలువ చేసే భూములను లూలు మాల్, ఇతర సంస్థలకు ధారదత్తం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమ కార్యచరణ రూపొందించామన్నారు. జీవీఎంసీలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న కార్పొరేటర్ల వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్లకు వినతిపత్రాలు అందించాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడానికి అన్ని విభాగాల కమిటీలను తక్షణమే నియమించాలని సూచించారు. సమావేశంలో వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఎమ్మెల్సీ రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తైనాల విజయకుమార్, తిప్పల నాగిరెడ్డి, సమన్వయకర్తలు ఎం.అప్పారావు, దేవన్‌రెడ్డి, మాజీ మేయర్ హరివెంకటకుమారి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.





గణనాథులకు ప్రత్యేక పూజలు

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పలుచోట్ల ప్రతిష్ఠించిన గణనాథులకు ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరిపారు. ఇందులో భాగంగా 90వ వార్డు పరిధిలోని వినాయక మండపాల్లో స్వామివారికి పూజలు జరిపాక మధ్యాహ్నం అన్న సమారాధనలను చేపట్టారు. లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోనూ అన్నదానం చేశారు. అలాగే బాజీ జంక్షన్ కరణాలవీధి యంగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వందలాది మందికి అన్న సమారాధన చేపట్టారు. కాకానీనగర్, సాకేతపురంలోని పలు మండపాల్లో గణనాథులకు పూజలు జరిపారు.

ఆటోనగర్: జీవీఎంసీ 70వ వార్డు పరిధి టీవీఎన్ కాలనీలో ఆదివారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీదేవి, భూదేవి సమేత గణనాథుని మండపంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. 86వ వార్డు గ్రీన్‌లాండ్స్ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద సామూహిక కుంకుమ పూజలు, సుందరకాండ పారాయణంతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించారు. కాలనీ పెద్దలు దామా సుబ్బారావు, అమిరెడ్డి మురళీధరరెడ్డి,


కరణాల వీధిలో పూజలు అందుకుంటున్న గణనాథుడు

గోగినేని మల్లికార్జున్, శ్రీనివాస్, శ్రీధర్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు. 87వ వార్డు తిరుమలనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేశుని మండపం వద్ద అన్న సమారాధనను కార్పొరేటర్ బొండా జగన్ ప్రారంభించారు. కాలనీ పెద్దలు జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం, సన్యాసిరావు, పరమేశ్వరరావు, వసంత రెడ్డి, రమణ, ప్రగడ శంకరరావు, శ్రీనివాసరావు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 88వ వార్డు ఎస్టీబీఎల్ కాలనీలో చైర్మన్ ఎస్టీబీఎల్ బాలాజీ ఆధ్వర్యంలో శ్రీవరసిద్ధి వినాయక ఆలయంలోని స్వామివారిని కుంకుమతో అలంకరించడంతో పాటు ఐశ్వర్య లక్ష్మీగణపతి హోమం జరిపారు. వుడా ఫేజ్-2, 6, తిరుమల నగర్, రాసాలమ్మ కాలనీ, సైమన్ నగర్, తదితర ప్రాంతాల్లోని గణనాథుని మండపాల వద్ద అన్న సమారాధనలను చేపట్టారు.

అగనంపూడి: పెదమడక సంపత్ వినాయక ఆలయంలో గణపతి నవరాత్రుల్లో భాగంగా ఆదివారం స్వామివారికి విశేష గరిక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి అష్టోత్తర శత నామార్చన, పంచ హారతి పూజలు చేశారు. షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మోటూరి వెంకటరమణ, నెల్లి శ్రీనివాసరావు, ఎం.నరసింగరావు, వి.నారాయణరావు, వ్యాసశర్మ, వి.రాము, శ్రీనివాసరావు, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

